# మిసిమి

మాస పత్రిక

జనవరి-2005



రూ. 8/-



డావిన్సీ స్వీయ చిత్రం. ఈ చిత్రం వేసేనాటికి డావిన్సీ 60 సం. వయస్సువాడు.
ఎట్టిటి సుద్ద ముక్కతో ఒక రేఖా చిత్రంగా దీన్ని గీశాడు.
ఇందులో చెరిపివేతలు, దిద్దుబాటులు ఏమీ వుండవు.
అతని అఖండ ప్రజ్ఞకు నిదర్శన మీ చిత్రం.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 16 | జనవరి 2005 | సంచిక 1

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

జ్ఞానపీఠ్ పురస్కారం - ప్రొ. జె. లక్ష్మీరెడ్డి

బహుముఖ ప్రజ్ఞాశాలి - లీనార్డో డావిన్సీ - కాంద్రేగుల నాగేశ్వరరావు

మిథ్యాభిమాన్ - కన్యాశుల్కము - డా. యు.ఎ.నరసింహమూర్తి

తెలివాహ గోదావరినది - డా. సంగనభట్ల నరసయ్య

మనిషికి పెద్ద బెడదగా తయారయిన దోమలు - సి.వి. సర్వేశ్వర శర్మ

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : "**వాగ్దేవి**"

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**



# వాగ్దేవి : పురస్కారానికి ప్రతీక

జ్ఞాన్ పీఠ్ పురస్కారానికి ప్రతీకగా స్వీకరించబడిన వాగ్దేవి సరస్వతికి సంబంధించిన ఈ కంచు ప్రతిమ మొదట మాల్వా ప్రాంతంలోని ధార్ అనే చోట సరస్వతీ కంఠాభరణ ప్రసాద్ అనే దేవాలయంలో ఉండేది. ఈ దేవాలయాన్ని ఉజ్జయిని నుండి పరిపాలించిన విద్యాధిపుడైన భోజరాజు క్రీ.శ. 1035లో కట్టించాడు. ఇప్పుడు ఈ ప్రతిమ లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉంది. సాహిత్య పురస్కారానికి ప్రతీకగా స్వీకరించినప్పుడు భారతీయ జ్ఞాన్‌పీఠ్ వారు ఈ ప్రతిమ శిరస్సు వెనుక భాగంలో ఒక ప్రభామండలాన్ని చేర్చారు. ఇందులో మూడు కిరణ పుంజాలున్నాయి. ఇవి భారత దేశంలోని అతి ప్రాచీనమైన తోరణ ద్వారం ( కంకాలీ టీలా, మథుర) లోని రత్నత్రయానికి ప్రతీకలు. వాగ్దేవి స్వీకరించి ఉన్న పుస్తకము, కమండలము, రుద్రాక్ష మాల, కమలము వరుసగా జ్ఞానానికి, సంయమనానికి వైరాగ్య భావనకు, అంతర్దృష్టికి ప్రతీకలు.

జ్ఞాన్‌పీఠ్ పురస్కార గ్రహీతకు వాగ్దేవి కంచు ప్రతిమ కానుకగా ఇవ్వబడుతుంది.

# జ్ఞానపీఠ్ పురస్కారం

- ప్రొ. జె. లక్ష్మీ రెడ్డి

జ్ఞానపీఠ పురస్కారం భారతీయ సాహిత్యంలో ఒక అగ్ర స్థానాన్ని అలంకరించింది. ఎందు చేతనంటే భారతీయ భాషలన్నింటికి కలిపి ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన సాహిత్య బహుమతి ఈ పురస్కారం ద్వారానే మొదటిసారిగా కల్పించడం జరిగింది. మన రాజ్యాంగంలోని 8వ అనుసూచికలో మొన్నటి దాకా 15 భాషలకు, ఇప్పుడు 18 భాషలకు గుర్తింపు ఉంది. ఈ భాషలన్నింటిలో వేర్వేరుగా చిన్నవి, పెద్దవి ఎన్నో ప్రాదేశిక స్థాయిలో, జాతీయ స్థాయిలో (ఉదా॥ కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి) పురస్కారాలు ఉన్నాయి. కానీ, ఈ భాషలన్నింటి నుండి ఎంపిక చేసి ఏదో ఒక ఉత్కృష్ట రచన లేక రచయిత గౌరవార్థము భారతీయ నాగరికులకు అందజేయబడుతున్న పురస్కారాలు రెండింటిలో (కె.కె. బిర్లా ఫౌండేషన్, న్యూఢిల్లీ వారి సరస్వతీ సమ్మాన్ రెండవది) ఇదే మొదటిది.

ప్రతి సంవత్సరం ఇవ్వబడే ఈ పురస్కారంలోని ఒక విశేషం ఏమిటంటే ఇది భారతదేశ సాహిత్యంలోని భాషల మధ్య ఒక సేతువుగా పని చేయడమే కాక సాహిత్య కొలమానాలను రూపొందించడంలో కూడా ప్రధానమైన పాత్రను పోషిస్తూ ఉంది. వేర్వేరు భాషల రచయితలను నేటి భారతీయ సాహిత్య నేపథ్యంలో పరీక్షించి వారిని పరిమిత భాషా ప్రాంతం నుండి వెలికి తెచ్చి జాతీయ స్థాయిలో వారిని ప్రతిష్ఠింప చేయడంలో భారతీయ జ్ఞానపీఠ్ అద్భుతమైన సఫలత సాధించింది. సాహిత్యం ద్వారా దేశపు భావనాత్మక ఐక్యతను పెంపొందించడంలో తన వంతు సహకారాన్ని కూడా జ్ఞాన్ పీఠ్ అందిస్తూ ఉంది. ఈ పురస్కారం వెనక దేశంలోని ఎందరో రచయితల, మేధావులైన పాఠకుల ఆదరాభిమానాలు ఉన్నాయి.

ఒక లక్ష రూపాయలతో మొదలై ఇప్పుడు 5 లక్షల రూపాయలకు చేరుకున్న ఈ పురస్కారం 14-15 ఏండ్ల నుండి ఇవ్వబడుతున్న 'సరస్వతీ సమ్మాన్' పురస్కారాన్ని మినహాయిస్తే - తక్కిన అన్ని సాహిత్య పురస్కారాలకంటే చాలా ఎక్కువ కూడా. అందుకే దీన్ని భారతదేశపు నోబెల్ బహుమతిగా చెప్పుకుంటారు. ఈ పురస్కారం పొందిన రచయిత, ఆ రచయిత రచనలు, ఒక్కసారిగా ప్రాంతీయ స్థాయి నుండి జాతీయ స్థాయికి ఎదిగిపోవటం జరుగుతుంది. ఎన్నో భాషలలో వారి రచనల అనువాదాలు వెలువడతాయి. వారి సాహిత్యాన్ని గురించి చర్చలు, విశ్లేషణలు జరుగుతాయి.

ఇన్ని భాషల నుండి ఒక సర్వోత్కృష్ట రచనను (మొదటి 17 పురస్కారాల వరకు ఉన్న నియమం ప్రకారం) లేదా సాహిత్య రచయితను (18వ పురస్కారం నుండి అమలు పరచబడిన నియమం ప్రకారం)

---

ప్రొ. జె. లక్ష్మీరెడ్డి, ఢిల్లీ యూనివర్సిటీలో హిందీ ఆచార్యులు, న్యూఢిల్లీ.

ఎంపిక చేయడం చాలా కష్టమైన పని. ఈ ఎంపిక గురించి ఎన్నో ప్రశ్నలు, సందేహాలు కలగడం సహజం. ఒకే భాషలోని శ్రేష్ఠరచనను లేదా రచయితను ఎంపిక చేయడమే చాలా ఇబ్బంది కరము, వివాదస్పదము అవుతున్నప్పుడు ఎన్నో భాషల నుండి ఆ భాషా పండితుల సహాయంతో కొన్ని రచనలను ఎంపిక చేయ గలిగినా వాటిని పోల్చి విలువ కట్టడం ఎలాగ? దాని ప్రక్రియ, కొలమానాలు ఎలా ఉండాలి? అనేక భాషలలో నిష్ణాతులైన రచయితలు, పండితులు దొరకడం దాదాపు అసంభవం కాదా? ఎలాగో ఈ ఇబ్బందులను అధిగమించగలిగినా ఇంత కష్టసాధ్యమైన ప్రక్రియ తర్వాత జరిగిన నిర్ణయాలను సాహిత్య జగత్తు మన్నిస్తుందా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు రేకెత్తడం సహజం. ఈ ప్రణాళికకు వ్యావహారిక రూపం ఇచ్చిన రచయితలు, పండితులు ఈ ప్రశ్నలన్నింటికి సంతృప్తి కరమైన సమాధానాలు వెతక గలిగారు. అందువల్లనే 39 ఏండ్లుగా సాహిత్యాభిమానుల సహకారము, సూక్ష్మ విశ్లేషణల ఆధారంగా జరుగుతున్న ఎంపిక అందరి మన్ననలు పొందగలుగుతూ ఉంది.

జ్ఞానపీఠ్ పురస్కారం గొప్ప పారిశ్రామికవేత్త టైమ్స్ ఆఫ్ ఇండియా సమూహపు పత్రికల అధినేత, భారతీయ జ్ఞానపీఠ్ సంస్థాపకులు శ్రీ సాహూ శాంతి ప్రసాద్ జైన్ సతీమణి శ్రీమతి రమా జైన్‌గారి ఆలోచనలకు రూపకల్పన. భారతదేశంలో భాషలు ఎన్ని ఉన్నా, ఆ భాషల సాహిత్యం నుండి వెలువడే మట్టి సువాసన ఒకటేనని ఆమె నమ్మేది. ఆ సువాసనను వెదికి దాన్ని గౌరవించాలనే కోరిక ఆమెకు కలిగింది. దాని ఫలితమే ఈ పురస్కారం.

ఈ పురస్కారం 22 మే 1961న శ్రీసాహూశాంతి ప్రసాద్‌జైన్ 50వ జన్మదిన సందర్భంగా సంకల్పన జరిగింది. ఆ తర్వాత 16 సెప్టెంబరు 1961న భారతీయ జ్ఞానపీఠ్ ట్రస్ట్ సమావేశంలో అన్ని భారతీయ భాషలలోని ప్రసిద్ధ రచయితల ఉత్తమ రచనల హిందీ అనువాదాలను ప్రచురించే ఉద్దేశ్యంతో స్థాపించబడిన 'రాష్ట్ర భారతీయ గ్రంథమాల' గురించి చర్చ జరుగుతున్నప్పుడు జ్ఞానపీఠ్ అధ్యక్షురాలు శ్రీమతి రమాజైన్ ''భారతీయ భాషల్లో ప్రచురింప బడిన పుస్తకాల్లో నుండి సర్వశ్రేష్ఠంగా భావించ దగిన ఒక పుస్తకాన్ని ఎంపిక చేసి దానికి బహుమతిగా ఒక పెద్ద మొత్తం ఇవ్వడం మనకు సాధ్యం కాదా?'' అని ప్రశ్నించింది. కొంత చర్చ జరిగిన తర్వాత దేశంలోని విభిన్న ప్రాంతాల్లో ఉన్న సాహిత్యవేత్తలతో ఈ విషయంగా చర్చలు జరపడం అవసరమని తీర్మానించారు.

ఈ ఆలోచనకు కార్యరూపాన్నిచ్చే విషయంలో కూడా రమాజైన్‌చొరవ చూపించారు. ఇందుకోసం ఆమె 22 నవంబరు 1961న కొందరు సాహిత్య వేత్తలను తన నివాసానికి ఆహ్వానించారు. ఆ గోష్ఠిలో కాకా కాలేల్కర్, హరివంశరాయ్ బచ్చన్, రామధారీ సింహ్ దినకర్, జైనేంద్ర కుమార్, జగదీశ్‌చంద్ర మాథుర్, ప్రభాకర్ మాచ్వే, తదితరులు పాల్గొన్నారు. ఈ సంప్రదింపుల తర్వాత రూపు దాల్చిన

ప్రాథమిక ప్రణాళికను రెండు రోజుల తర్వాతనే, 25 నవంబరు 1961న సాహూ శాంతి ప్రసాద్ జైన్ సలహాలు సూచనల కోసం రాష్ట్రపతి డా. రాజేంద్రప్రసాద్ ముందుంచారు. డా. రాజేంద్రప్రసాద్ ఈ ప్రణాళికను మెచ్చుకొని అందుకు తన సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

ఆ తర్వాత పలు భాషల సాహితీవేత్తలతో సంప్రదింపులు మొదలయ్యాయి. 6 డిసెంబరు 1961న కలకత్తాలోని ప్రముఖ రచయితలు, విమర్శకులతో పురస్కార ప్రణాళికపై చర్చలు జరిగాయి. ఆ తర్వాత కొద్ది రోజులకే 1 జనవరి 1962న కలకత్తాలోనే అఖిల భారత గుజరాతీ సాహిత్య పరిషత్తు, భారతీయ హిందీ పరిషత్తు వారి వార్షిక సమావేశాల్లో పాల్గొనడానికి విచ్చేసిన దాదాపు 72 మంది సాహితీ వేత్తల నందరిని ఆహ్వానించి వారితో సంప్రదింపులు జరిపారు. ఈలోగా ప్రణాళిక స్వరూపాన్ని తెలుపుతూ 4500 ఉత్తరాలు దేశంలోని అనేక సాహిత్య సంస్థలకు, రచయితలకు, వారి ప్రతిస్పందన తెలుసుకోవడం కోసం పంపడం జరిగింది. ఇన్ని సంప్రదింపులు, చర్చలలో ఈ ప్రతిపాదన ప్రశంసనీయమైందని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా దాన్ని ఆచరణలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేయడం అవసరమని నిష్కర్షగా తెలుతూ వచ్చింది. ప్రణాళికకు అంతిమ రూపం ఇవ్వడానికి 2 ఏప్రిల్ 1962న ఢిల్లీలో భారతీయ జ్ఞానపీఠ్, టైమ్స్ ఆఫ్ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో ఒక బృహత్ గోష్ఠి ఏర్పాటు చేయబడింది. అందులో దేశంలోని అన్ని భాషలకు చెందిన 300 మంది గొప్ప గొప్ప సాహిత్యవేత్తలు పాల్గొన్నారు. ఈ గోష్ఠిలో పురస్కారానికి సంబంధించిన ప్రతిపాదన పై విస్తారంగా చర్చలు జరిగిన తర్వాత ప్రణాళికను ఆమోదించడం జరిగింది.

విభిన్న భాషల రచయితలకు, విమర్శకులకు, ఉపాధ్యాయులకు, ఉత్తమ పాఠకులకు ఈ పురస్కారానికి తగిన వారిని సూచిస్తూ ప్రతిపాదనలు పంపమని ఉత్తరాలు పంపడంతో ఈ ఎంపిక ప్రక్రియ ఆరంభమయింది. ఈ విధంగా వచ్చిన పేర్ల విస్తృతమైన జాబితాలో మార్పులు, చేర్పులు జరుగుతాయి. పైన పేర్కొన్న వారితో పాటు విశ్వ విద్యాలయాలను, సాహిత్య సంస్థలను, భాషా సంస్థలను కూడా పురస్కారం కోసం తమ ప్రతిపాదనలు పంపమని కోరడం జరుగుతుంది. ఈ విధంగా వేర్వేరు భాషల నుండి అందిన ప్రతిపాదనలను ఆయా భాషలకు సంబంధించిన పరామర్శ సమితికి పంపడం జరుగుతుంది. ప్రతిభాషకు ఇలాంటి పరామర్శ సమితి ఒకటి ఉంటుంది. ఒక్కొక్క భాషా సమితిలో ముగ్గురు సభ్యులు ఉంటారు. సాధారణంగా ఈ సభ్యుల పదవీ కాలం 3 సంవత్సరాలు ఉంటుంది. అవసరమైనప్పుడు ఈ కాల పరిమితిని పొడిగించవచ్చు. ఈ సభ్యుల నియామకం పురస్కారానికి సంబంధించిన ఎంపిక మండలిద్వారా జరుగుతుంది. భాషా సమితుల సభ్యులందరు తమ తమ భాషలో ప్రసిద్ధికెక్కిన రచయితలు, విమర్శకులు లేక ఉపాధ్యాయులుగా ఉంటారు. ప్రస్తుతం

తెలుగు భాషా సమితిలో ప్రొ. కేతు విశ్వనాథరెడ్డి, ప్రొ. జి.వి. సుబ్రహ్మణ్యం, ప్రొ. కొలకలూరి ఇనాక్ సభ్యులుగా ఉన్నారు.

భాషా సమితుల సభ్యులు తమ సంప్రదింపులను సమితికి చేరిన ప్రతిపాదనల వరకే పరిమితం చేసుకోవాలనే నియమం ఏమీ లేదు. ఏ రచయితనైనా పురస్కారం కోసం పరిగణనలోకి తీసుకొనే స్వేచ్ఛ వారికి ఉంటుంది. నిజానికి ఆ భాషలో పురస్కారానికి అర్హుడని భావించబడే రచయితలందరిని పరిగణనలోకి తీసుకోవాలనేదే ఎంపిక మండలి ఉద్దేశ్యం. ఏ రచయితనైనా పరిగణనలోకి తీసుకునేప్పుడు ఆ భాషా సమితి ఆ రచయిత యొక్క రచన లన్నింటిని బేరీజు వేయడమే కాక సమకాలీన భారతీయ సాహిత్య నేపథ్యంలో ఆ రచయితను పరీక్షించవలసి ఉంటుంది కూడా. పురస్కార నియమాల ప్రకారం ఏ భాషకైనా ఒకసారి పురస్కారం ప్రధానం చేసిన తర్వాత మూడు సంవత్సరాల దాకా మళ్ళీ ఆ భాషను పరిగణనలోకి తీసుకోరు. ఈ విధంగా ప్రతి సంవత్సరం 12 భాషల ( ఇప్పుడు 15 భాషల) రచయితలనే పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది.

ఎంపిక సమితిలో 7 మందికంటే తక్కువగాని, 11 మంది కంటే ఎక్కువగాని సభ్యులు ఉండరాదు. వీరిలో నుండే ఒకరు సమితికి అధ్యక్షులవుతారు. ఎంపిక సమితి సభ్యత్వ కాల పరిమితి 3 సంవత్సరాలు. కాని ఆ తర్వాత కూడా వారిని మళ్ళీ నియామకం చేసుకోవచ్చు. ఎంపిక సమితి అధ్యక్షుడు సభ్యులు పేరు మోసిన పండితులు, విద్వాంసులై ఉంటారు. డా. రాజేంద్రప్రసాద్ దీనికి మొదటి అధ్యక్షులు. ఆ తర్వాత ఆచార్య కేల్కర్, డా. సంపూర్ణానంద్, డా. బెజవాడ గోపాలరెడ్డి, డా. కరణ్ సింగ్, ఆచార్య హజారీ ప్రసాద్ ద్వివేదీ, డా. వినాయక కృష్ణ గోకాక్, డా. ఉమాశంకర్ జోషి, డా. నీహార్ రంజన్ రాయ్, డా. రవి కుమార్ దాస్‌గుప్త, డా. మసూద్ హుసేన్, ప్రొ. ఎమ్.వి. రాజాధ్యక్ష్, డా. ఆదిత్యనాథ్ ఝా, శ్రీ గజదీశ్ చంద్ర మాథుర్, శ్రీ పి.వి. నరసింహరావు లాంటి సాహిత్య వేత్తలు, పండితులు అధ్యక్షులుగాను, సభ్యులుగాను వ్యవహరించారు.

ఎంపిక సమితి ప్రాంతీయ భాషా సమితుల సిఫార్సుల తులనాత్మక మూల్య నిర్ధారణ చేస్తుంది. ఇందుకోసం అవసరమనిపిస్తే ఆ రచనలను హిందీలోకి, ఇంగ్లీషులోకి అనువాదం చేయిస్తుంది. అవసరాన్ని బట్టి ప్రసిద్ధులైన విమర్శకుల ద్వారా కూడా పరిగణనలో ఉన్న రచయితల తులనాత్మక పరిశీలన చేయిస్తుంది. నిర్ణయం తీసుకొనేప్పుడు రచయిత యొక్క సంపూర్ణ రచనలను దృష్టిలో ఉంచుకోవడమే కాక ఆ రచయిత సాహిత్యం ఆ భాషలోని సాహిత్యాన్ని, ఇతర భాషల సాహిత్యాన్ని ఎంతగా ప్రభావితం చేసింది. అతని సాహిత్యంలో స్థిరతా గుణం ఎక్కువగా ఉందా, లేదా, అనే అంశాన్ని గురించి కూడా ఆలోచించడం జరుగుతుంది. ఈ రీతి దీర్ఘ పర్యాలోచన తర్వాతే పురస్కారం విషయంలో అంతిమ నిర్ణయం జరుగుతుంది.

పైన చెప్పినట్లు మొదట 17 పురస్కారాలు శ్రేష్ఠమైనవని భావించబడిన రచనలకు ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత చాలా చర్చలు, సంప్రదింపుల తర్వాత పురస్కారం ఏదో ఒక రచనకు కాకుండా రచయిత యొక్క కర్తృత్వ ప్రతిభకు ఇవ్వాలనే నిర్ణయం జరిగింది. కొన్ని సంవత్సరాలు ఇలా జరిగింది కూడా. కాని ఇందులో కూడా కొన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయి. అందువల్ల 23వ పురస్కారం నుండి నియమంలో మళ్ళీ సవరణ జరిగింది. ఇప్పుడు అదే నియమం అమలులో ఉంది. ఈ నియమం ప్రకారం ఏ సంవత్సరానికైతే పురస్కారం నిర్ణయించ బడుతూందో, అంతకు మునుపటి 5 సంవత్సరాలను వదిలేసి, అంతకు పూర్వం 15 సంవత్సరాలలో వచ్చిన ఆ రచయిత రచనలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది.

భారత దేశపు వేర్వేరు భాషల సాహిత్యాలలో ప్రతిబింబించే సామాజిక సంస్కృతీ స్వరూపం కొంత వేరువేరుగా ఉన్నప్పటికీ ఈ సాహిత్యాల్లో భారతదేశ సాహిత్యపు ఏకత్వాన్ని నిరూపించే అంశాలు కూడా చాలానే ఉన్నాయి. విభిన్న భాషల్లో విస్తరించి ఉన్న ఈ సాహిత్యంలో నుండి ఏటేటా సర్వోత్కృష్టమైన రచనను లేక రచయితను వెలుగులోనికి తెచ్చి ఈ పురస్కారం ఒక జాతీయ అవసరాన్ని తీర్చడమే కాక జాతి ఐకమత్యానికి సంబంధించిన ఒక ముఖ్యమైన అనుష్ఠానంగా కూడా తయారయింది. పురస్కారాన్ని ప్రకటిస్తూ శ్రీమతి రమాజైన్ ఇలా అన్నారు, ''ఈ పని చాలా కష్టమైందని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. కాని ఇందులోని కష్టాలు దుర్లంఘ్యమైనవి కావు. జాతీయ ప్రాముఖ్యత గల ఈ పనికి ఎంత శ్రమ పడవలసి వచ్చినా, ఎంత ధనం ఖర్చు చేయవలసి వచ్చినా, మనం నెరవేర్చి తీరాలి''. ఎందరో సాహితీవేత్తల సహకారంతో భారతీయ జ్ఞాన్‌పీఠ్ ఈ విషయంగా తన బాధ్యతను నిర్వహిస్తూ ఉంది.

మొదటి పురస్కారం 1965లో మళయాళ కవి శ్రీ శంకర కురుప్‌కు ఇవ్వడం జరిగింది. అప్పటి నుండి ఇప్పటి వరకు పురస్కారం ప్రదానం జరిగిన 37 సంవత్సరాల్లో 40 మంది రచయితలకు ఈ పురస్కారం ఇవ్వబడింది. మూడుసార్లు ఇద్దరు ఇద్దరు రచయితలకు సంయుక్తంగా ఈ బహుమతి ఇవ్వడం జరిగింది. ఇంతవరకు ఈ బహుమతి కన్నడ భాషకు 7 సార్లు, హిందీకి 6 సార్లు, బెంగాలీకి 5 సార్లు, మళయాళానికి 4 సార్లు, ఒరియా, ఉర్దూ, గుజరాతీ భాషలకు మూడు సార్లు, అసమియా, గుజరాతీ, మరాఠీ, తెలుగు, పంజాబీ భాషలకు రెండుసార్లు, తమిళానికి ఒకసారి ఇవ్వబడింది.

జ్ఞాన్‌పీఠ్ పురస్కార స్వీకారోపన్యాసాలు ఫిబ్రవరి నుండి ప్రారంభమవుతాయి

# బహుముఖ ప్రజ్ఞాశాలి - లీనార్డో డావిన్సీ

- కాండ్రేగుల నాగేశ్వరరావు

ప్రపంచ చరిత్రలో బహుముఖ ప్రజ్ఞాశాలి మేధావి అన్నమాటకు అన్ని విధాలా అర్హుడయినమొదటి వ్యక్తి లీనార్డో - డావిన్సీ. అతనిది సుందరమైన రూపం. బలిష్టమైన కండలు తిరిగిన శరీర సౌష్టవం. చేతి వేళ్ళతో గుఱ్ఱపు నాడాను వంచగలిగే ధీశాలి. శ్రావ్యమైన కంఠస్వరం, లూట్ వాయిద్య విశేషాన్ని అతి లాలనగా వాయించటంలో అతనితో సాటి రాగలవారు చాలా తక్కువ మంది. గణిత, భౌతిక, రసాయనక శాస్త్రాలను అవోపోసన పట్టినశాస్త్రజ్ఞుడు. మానవ శరీర అంతరంగ భాగాలను శాస్త్రీయంగా చిత్రీకరించిన మొట్టమొదటి చిత్రకారుడు. కవి, ఇంజనీరు, శిల్పి, భవిష్యత్ దర్శి, చెప్పుకుంటూ పోతే ఈ విశ్లేషణలు అనంతం.

1453వ సం॥లో కానిస్టాంట్ నోపుల్ తురుష్కుల వశమైంది. ఈ యాదృశ్చిక సంఘటన ప్రపంచ మానవ సాంఘిక పరిణామంలో అత్యున్నత దశగా భావించ బడే పునర్వికాసపు (Renissance) కు దారి తీసింది. ఇది అంతకు ముందు కాలంలో జరిగిన మంచిని, శాస్త్ర తర్కంతో విడదీసి, నవీన భావాలతో విజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న కాలమది. ఆ మహోన్నత దశను సూచిస్తూ ఒక సంవత్సరం ముందుగా పొడిచిన వేగుచుక్కలా ఫ్లారన్స్ నగరానికి 20 మైళ్ళ దూరంలో పర్వత శ్రేణుల సమాహారం మధ్యనున్న ఒక చిన్న పల్లె జస్కాన్సీ (Jusconcy) లో క్రీ॥శ॥ ఏప్రిల్ 15, 1452వ సంవత్సరంలో డావిన్సీ జన్మించాడు. తండ్రి ప్రభుత్వ న్యాయవాది (Notary) పియరో ఆంటానియో విన్సీ. తల్లి ఏమీ ఎరుగని ఒక పల్లెటూరు పిల్ల, కాటరీనా. వీళ్ళిద్దరికీ వివాహం కాలేదు. డావిన్సీ తండ్రి, డావిన్సీ పుట్టిన తరువాత వేరే ఆమెను వివాహం చేసుకున్నాడు. తల్లి కాటరీనా మరొక పల్లెవానిని పెండ్లి చేసుకొని ఎటో వెళ్ళిపోయింది. వివాహేతర సంబంధం ద్వారా జన్మించిన అక్రమ సంతాన మతడు (He is a bastard child). అతని అసాధారణ ప్రజ్ఞాపాటవాలను గుర్తించిన రాజులు, రారాజులు మతాదిపతులు అందరూ అతన్నొక అపూర్వ వ్యక్తిగా భావించేవారు. అతని పుట్టుకకు సంభంధించిన క్రీనీడలు అతని కులీనతకు ఏ మాత్రం అడ్డు తగలక పోవటం ఒక విశేషం. ఆనాటి సమకాలీనకాలంలో జీవించిన మైఖేల్ఆంజిలో, రాఫెల్ కన్నా వయస్సు రీత్యా మాత్రమే కాక అన్ని విధాలా పెద్దవాడు డావిన్సీ. అతని జీవితాన్ని చరిత్రకారులు స్థూలంగా నాలుగు (కాల) విభజనలు చేశారు : 1. ఫ్లారన్స్ నగరంలో గడపిన మొదటి 29 సంవత్సరాలు (1452 నుండి 1481 వరకు); 2. మిలాన్ నగరంలో గడపిన 18 సంవత్సరాలు (1482 నుండి 1500 వరకు); 3. కళాకారునిగా పరిపక్వత నొంది సంచార జీవితం సాగించిన 16 సంవత్సరాలు (1501 నుండి 1516 వరకూ); 4. పారిస్ నగరంలో గడపిన చివరి మూడు సంవత్సరాలు (1517 నుండి 1519 వరకూ).

బాల్యంలోనే డావిన్సీఅత్యంత ప్రతిభావంతునిగా రూపుదిద్దుకొన్నాడు. అతను ప్రకృతిని ప్రేమించేవాడు. తన చుట్టూ పరిభ్రమించే ప్రతి విషయంపై ఆశక్తి పెంచుకున్నాడు. వాటి అసలు స్వరూపాన్ని దర్శించాలనే జ్ఞానార్తితో రగిలి పోయేవాడు. నిరంతర జిజ్ఞాసతో శాస్త్రీయ

---

కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో అడిషనల్ కమీషనర్గా పదవీ విరమణ చేశారు. కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

దృక్పథాన్ని చిన్న తనంలోనే అలవరచుకున్నాడు. గణిత శాస్త్రంలో అద్భుతమైన ప్రజ్ఞాపాటవాన్ని సంపాదించాడు. వయస్సుకు మించి తెలివితేటలతో అతను చిక్కు ప్రశ్నలు వేసి లెక్కల మాష్టర్లను ముప్పుతిప్పలు పెట్టేవాడు. డావిన్సీ తండ్రికి స్నేహితుడైన వెరోషియో ఫ్లోరన్స్‌లో పేరు మోసిన చిత్రాకారుడు. డావిన్సీ వేసిన చిత్రాలను చూసి ముగ్ధుడై అతనిని తన విద్యార్థిగా తీసుకున్నడు. అప్పటికి డావిన్సీ వయస్సు 15 సంవత్సరాలు. అతనితో బాటుగా చిత్రకళ అభ్యసిస్తున్న సహాధ్యాయులలో ప్రముఖులు: బొట్టిసెల్లీ, డామినికో, గిర్లాండియో, కాసిమోరొజల్లీ, ఫిలిఫినో లిప్పి. అయితే వీళ్ళందరి కంటే పెర్జినో అతనికి ఆప్తుడుగా ఉండేవాడు. ఆనాటి సహాధ్యాయులందరిలోనూ అగ్రతాంబూలం డావిన్సీదే.

డావిన్సీ వెరోషియో చిత్రశాలలో పనిచేసే సమయానికి వెరోషియో ఒక ప్రతిష్టాత్మకమైన పనిని తలపెట్టాడు. రాగి వర్ణంతో కూడిన ఒక గ్లోబును చర్చి శిఖరంపై నిలబెట్టడం. దీనికిగాను బాలుడైన డావిన్సీని తనకు సహాయకునిగా ఎంపిక చేసుకున్నాడు. డావిన్సీ తన శక్తి యుక్తులన్నిటిని శాస్త్రీయ పరిజ్ఞానంతో సంఘటిత పరచి మిగిలిన వాళ్ళందరి కంటె ప్రతిభావంతునిగా పేరు పొందాడు. శిష్యునిలోని ప్రతిభను గుర్తించిన వెరోషియో చిత్రకళా విభాగాన్ని డావిన్సీకి వదలి, తాను శిల్పంపై మనస్సు లగ్నం చేసుకున్నాడు. డావిన్సీ వేసిన మొదటి చిత్రాలేవీ అతని పేరు మీదుగా చలమణీ కాలేదు. Baptisling Christ అన్న వెరోషియో చిత్రంలోని దేవదూత చిత్రం డావిన్సీ వేసినదే. డావిన్సీ తనకు స్ఫూర్తి దాయకులుగా తనకు ముందున్న ఫ్లోరన్స్ చిత్రకారులైన లొరెంజో, మార్సిలియో ఫిసినోలను తీసుకున్నాడు. ఈ కాలంలో అతను వేసినగొప్ప చిత్రం 'ది ఎడొరేషన్ ఆఫ్ ది కింగ్స్' అన్న చిత్రం. ప్రస్తుత మీ చిత్రం యుఫిజీ గ్యాలరీ అమెస్టర్ డమ్‌లో ఉంది. బహుముఖ ప్రజ్ఞాశాలియైన అతని ప్రతిభ ఎల్లలు దాటి పయనించింది. ఆనాటి ఇటలీ ఈనాటి ఇటలీ దేశంలా లేదు. ఫ్లోరన్స్, వెనిస్, మిలన్, వంటి మూడు స్వతంత్ర రాష్ట్రాలుగా వేర్వేరుగా పాలించబడుతూ ఉండేది. వేటికన్, రోమ్ నగరాలు పోప్ ఆధీనంలో ఉండేవి. ఈ స్వతంత్ర రాష్ట్రాల మధ్య మిత్రవైరం ఉండేది. ఒకరిని మించి మరొకరు తమ ఆధిపత్యాన్ని చాటుకోవటం కోసం పేరు మోసిన కళాకారులను తమ రాజ్యానికి రప్పించుకొని వారిచే కొన్ని నిర్మాణాలు (చిత్రం, శిల్పం, భవనం) కావించేవారు.

ఆనాడు ఇటలీ ప్రాంతంలో అత్యంత పెద్దపట్టణం మిలాన్. డ్యూక్ లొడ్వికో ఫోర్జా (Duke Lodovice Sforza) దానిని పాలిస్తూ వుండేవాడు. యువరాజు ఫోర్జా ఆహ్వానంపై డావిన్సీ క్రీ॥శ॥1481వ సంవత్సరంలో మిలన్ చేరుకున్నాడు. ఆ యువరాజుకు వెండితో చేసిన ఒక గుఱ్ఱపు కపాలాన్ని పోలిన లూట్ వాయిద్యాన్ని తయారు చేసి బహూకరించాడు. ఆ రోజులలో ప్రజలు దాని గురించి గొప్పగా చెప్పుకొనేవారు. యువరాజుకు యుద్ధసామగ్రిపై మక్కువ ఎక్కువ. అంతేకాక అతను విలాస పురుషుడు కూడా. డావిన్సీ తనకున్న భౌతిక రసాయనక శాస్త్రపరిజ్ఞానంతో రాజు కోరిన యుద్ధ సామగ్రిని తయారు చేశాడు. 19 సంవత్సరాల పాటు రాజాశ్రయంలో ఉన్నాడు. నాటకాలకు సరిపడే తెరలు, సెట్టింగులు వేశేవాడు. లూట్ వాయించి పాటలు పాడేవాడు. చిన్న పిల్లలకు కావలసిన ఆటవస్తువులను తయారు చేసేవాడు. పొడుపు కథలు పొడిచేవాడు. సామెతలు చెప్పేవాడు. వీటన్నిటితోనూ రాజు మనస్సును రంజింప జేసి అతనికి ఆప్తునిగా మెలిగాడు. మిలాన్ పుర వీధులలో తిరుగుతూ, కనిపించిన

ప్రతివస్తువును, విశేషించి అనేకమంది వయస్సు మరలిన వాళ్ళను, కురూపులనూ చిత్రించేవాడు. ఆ రోజులలో మానవ అంతర్గత నిర్మాణంపై నున్న ఆసక్తితో, ఆరోగ్యంగా ఉండి అకస్మాత్తుగా మరణించే అనేక వ్యక్తుల శరీర భాగాలను కోసి లోపలి భాగాలను చిత్రించాడు. ఈ విధంగా సుమారు 30 మంది పై చిలుకు శరీరాలను తన పరిశోధనకు నియోగించుకొన్నాడని తెలుస్తుంది. (మానవ శరీరాన్ని కోసి అందులోని భాగాలను పరీక్షించుటపై వాటికన్ చర్చి 1533 సం॥ లో ఆ నిషేదం ఎత్తివేయబడినది. దానికి డావిన్సీ చిత్రాలే పరోక్షంగా కారణభూతాలయ్యాయి.) దీనిపై మత పరమైన ఏ విధమైన ఆంక్షలు లేకుండా ఉండేలా రాజు చూసుకున్నాడు. ఒకరోజు రాజు పిలచి తన తండ్రి యొక్క స్మృత్యర్థం ఒక శిల్పాన్ని తయారు చేయమని కోరినపుడు క్షణం ఆలస్యం చేయకుండా 'గొప్ప అశ్వమ'నే పేరుతో మట్టితో ఒక శిల్పాన్నయితే చేయగలిగాడు కాని దానిని శిల్పంగా పోత పోయట మతనికి ఒక పెద్ద సమస్యగా మారింది. దానికి శాస్త్రీయ పరమైన పరిష్కారాన్ని వెదకే పనిలో అది ఎప్పటికీ క్రియా రూపం దాల్చలేదు. క్రీ॥శ॥ 1499వ సంవత్సరంలో ఫ్రెంచి రాజయిన లూయిస్ XII మిలాన్‌పై దండెత్తి ఆ నగరాన్ని ఆక్రమించుకున్నాడు. డావిన్సీ మిలాన్ వదలి వెనిస్ నగరాన్ని చేరుకున్నాడు. మిలాన్‌లో రాజాశ్రయం లభించినా మిలాన్ వదలి వెనిస్ వెళ్ళేసరికి అతని చేతిలో ఎఱ్ఱని ఏగానీ లేదు. అతను చేసిన మట్టి ప్రతిమను ఫ్రెంచి సైనికులు తమ తుపాకుల తరిఫీదుకు లక్ష్యంగా చేసుకొని, కాలగతిలో దాన్ని తుత్తునీయలు చేశారు. మిలన్‌లో అతను జీవించినకాలంలో చిత్రించినవానిలో మహోన్నతమైన చిత్రాలు, మోనాలిజా, దిలాస్ట్ సప్పర్, వర్జిన్ ఆఫ్‌ది రాక్స్ చిత్రాలున్నాయి.

క్రీ॥శ॥ 1500-సంవత్సరంలో అతను మిలాన్‌ను విడచి పెట్టాడు. క్రీ॥శ॥1500 - 1516 సంవత్సరాల మధ్య వెనిస్, ఫ్లారన్స్ నగరాల మధ్య తచ్చాడుతూ ఉండేవాడు.

క్రీ॥శ॥1504వ సంవత్సరంలో తండ్రిమరణం అతన్ని విపరీతంగా కృంగ దీసింది. 60 సంవత్సరాల వయస్సులో తన అదృష్టాన్ని పరీక్షించుకోడానికి రోమ్‌నగరం చేరుకొన్నాడు. అప్పుడే వయస్సులో తనకన్నా 25 సంవత్సరాల పిన్న వయస్కుడైన మైఖేల్ ఆంజిలోను కలిశాడు. పోప్ జూలియస్ II వయస్సుడిగిన డావిన్సీకి సరైన పని కల్పించ లేకపోయాడు. ఫ్లారెన్స్, వెనిస్, మిలాన్ నగరాల మధ్య సంచరిస్తూ వచ్చాడు. ఎంతో పేరు ప్రఖ్యాతులున్నా ఏ పనిని సకాలంలో పూర్తి చేయడనే విమర్శ వుండేది.

క్రీ॥శ॥ 1517వ సంవ్సరంలో ఫ్రెంచి రాజయిన మొదటి ఫ్రాన్సిస్ డావిన్సీని పారిస్ నగరానికి పిలిపించుకొని, తన రాజాస్థానంలో చేర్చుకొని అతన్ని ఒక ఆత్మ బంధువుగా దగ్గరకు తీసుకున్నాడు. ఇంతగొప్ప వ్యక్తి అంతిమ రోజులు సుఖంగా గడవాలని డావిన్సీని సమస్త మర్యాదలతో అన్ని సౌకర్యాలు కలిగిన అంబయోస్ (Amboise) అనే భవంతిలో వుంచాడు. డావిన్సీ ఫ్రాన్సిస్‌కు ఇష్టమైన ఆట బొమ్మలను తయారు చేసేవాడు. ఘర్జిస్తూ అతిథులపై లంఘించే ఒక సింహం, ఆ తరువాత ఆ బొమ్మ నోటి నుంచి ఒక పూలహారం వచ్చేది. ఈ విధమైన బొమ్మలు తయారు చేసి రాజును సంతోషపెట్టాడు. ఇంతగొప్ప కళాకారుడు చివరకు బొమ్మలు చేసే పనివాడుగా మారటం బాధకరమని చరిత్రకారులు పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ అతని చివరి రోజులు చీకూ చింతా లేకుండా ఆనందంగా గడచి పోయాయి. 1519వ సం॥ మే 2న అతను దేహం చాలించాడు. అతని భౌతిక శరీరానికి సకల

మర్యాదలతో పారిస్ నగరంలో క్లౌక్సు (Cloux) అన్న చర్చిలో సమాధి గావించ బడ్డాడు. అయితే ఆ తరువాత క్రైస్తవ మతస్థులైన ప్రొటస్టాంటులు, కేథలిక్కుల మధ్య జరిగిన 30 సంవత్సరాల యుద్ధంలో జరిగిన వినాశనంలో క్లౌక్స్ చర్చితో బాటు అతని సమాధి రూపురేఖలు కూడా మారి పోయాయి. ఈనాడు అతనికి శ్రద్ధాంజలి ఘటించడానికి అతను చేసిన కళాకృతులు తప్ప భౌతిక పరమైన గుర్తులేవీ మిగలలేదు.

డావిన్సీ అందమైన మనిషేకాదు. అందమైన మనస్సు కూడా కలవాడు. ప్రకృతి పట్ల అతని కున్న ప్రేమ అమోఘమైనది. సంతకు వెళ్ళి పంజరంలో వుంచబడ్డ పక్షులను కొని ఇంటికి వచ్చిన తరువాత వాటికి స్వేచ్ఛను ప్రసాదించేవాడు. అతని దస్తూరి చాలా చిత్రంగా ఉండేది అక్షరాలను కుడినుంచి ఎడమకు తిరగవేసి వ్రాసేవాడు (Mirror writing). అవి అద్దం ముందు పెట్టినపుడే స్పష్టంగా చదవడానికి వీలుకలిగేది. డావిన్సీ పూర్తిచేసిన చిత్రాలకంటే అసంపూర్ణంగా వదలినవే ఎక్కువ. నిరంతర జిజ్ఞాస, పరిశీలన, పరిశోధనలతో ఎక్కువకాలం తలమున్కలవటంతో అతను వేసిన చిత్రాలు, అసంపూర్ణంగా ఉన్న వాటితో కలసి మూడు పదుల సంఖ్య కూడా దాటదు. డావిన్సీ వేసిన కుడ్య చిత్రాలు ఎక్కువ కాలం నిలబడలేదు. రంగులను రంగరించటంలో, దానికి కావలసిన మాధ్యమాన్ని ఎన్ను కోవడంలో ఎప్పటికప్పుడు ప్రయోగాత్మకమైన కొత్త పోకడలకు పోవటంతో కొన్ని చిత్రాలు ఆధారాలు లేనంతగా నశించాయి.

అతనికి ఊహలెక్కువ. ఊహకు శాస్త్రీయత జోడించి వాస్తవ రూపంలో నిజం చేయాలన్నదే అతని తపన. నదీ ప్రవాహాల పై ప్రయాణానికి అనుకూలంగా వుండే లాకుల నిర్మాణం ఆలోచనే కాదు, ఆచరణ కూడా అతనిదే. వేర్వేరు నదీ ప్రవాహాలను అనుసంధించి బీడు భూములను సస్యశ్యామలంగా మార్చాలనే ఆలోచనలకు కొంతవరకు శాస్త్రీయ సమాధానాన్ని తయారు చేసుకొన్న అపర భగీరథుడతను. భూమిలోపల సొరంగాలు తవ్వి ఒక దేశం నుండి మరొక దేశానికి నిరాటంక మైన ప్రయాణ మార్గాన్ని ఏర్పరచాలనే ఆలోచన వుండేది. ఆ ప్రయాణానికి అనువైన యంత్రాలను తయారు చేసి దానికి నీటిని ఇంధనంగా ఉపయోగించాలనే ఆలోచనా పూరక ప్రయత్నాలు చేశాడు. హార్వేకంటే ఎంతో ముందుగా సూత్రప్రాయంగా మానవ రక్త ప్రసరణపై అతనుసిద్ధాంతీకరించాడు. శాస్త్రీయతతో కూడిన తన ఆలోచనలను అతను విడివిడి కాగితాలుపై వ్రాయటం వలన, అందులో పోయినవి పోగా మిగిలినవి 13 సంపుటాలుగా తయారయినాయి. ఇందులో ఏవీ కూడా తన జీవిత కాలంలో వెల్లడించక పోవటం వలన సమకాలీన ప్రజలకు అవి అంతగా ఉపయోగ పడలేదు. అతను తన ఊహకు శాస్త్రీయంగా, భౌతిక శాస్త్రానికి అనుకూలపడేలా వేసుకున్న చిత్రాలలో పేరాచూట్, హెలీకాప్టర్, విమానం, ఆకాశవిహంగం (Skydiving), యుద్ధటాంకు మొదలైనవి ఎన్నో వున్నాయి. అతను మనిషి భూమిపై నడచినంత సులువుగా నీటిపై నడచేందుకు గాలితో నింపినపాదరక్షలు తయారు చేయాలన్న ఊహ ఈనాటికీ వాస్తవ రూపం ధరించలేదు. భూమిపై నుండి భూమ్యాకర్షణ శక్తికిలోను కాకుండా గాలిలో తేలియాడే ఒక చర్చిని నిర్మించాలన్నది అతని మరొక ఊహ. తన ఊహలలో, ఆలోచనలలో అతను సుమారు 500 సంవత్సరాల ముందున్న కాలాన్ని చూసిన భవిష్య దర్శి.

డావిన్సీ తరువాత పేరుగాంచిన రాఫెల్‌కు డావిన్సీ ఒక దేవదూత. డావిన్సీ తరువాత వచ్చిన చిత్రకారుల్లో క్లాసికల్ శైలికి సంబంధించిన కరవేగియో, డేవిడ్, ఇంగ్రిస్ మొదలుకొని ఆధునికులైన పికాసో, డాలీ, పాల్‌క్లీ వరకూ అందరూ అతనిని అభిమానించినవారే. అయితే ఇంతగొప్ప వ్యక్తిలోనూ కొన్ని చీకటి కోణాలు లేకపోలేదు. డావిన్సీ అవివాహితుడు, స్వలింగ సంపర్కి. అసహజ రతి జరుపుతున్న వ్యక్తిగా న్యాయస్థానంలో నిలబడ్డాడు. ఆ రోజులలో దానికి చితిపేర్చి మనుష్యులను అగ్నికి ఆహుతి చేసే శిక్షవుండేది. అయితే న్యాయమూర్తులు అతనిని అభిమానించే కారణంతో సాక్షాలు లేవని కేసులు కొట్టివేసారు. న్యాయస్థానంలో నిలబడ్డప్పుడు డావిన్సీ ''ప్రేమించటం మానవ హక్కు. దానికి స్త్రీ పురుష భేదాలు లేవు. ప్రేమించకుండా మనిషి జీవించటం సాధ్యమా?'' అని ఎదురు ప్రశ్నవేశాడు. నిజానికి మోహావేశమే సృష్టికి మూలమనేభావాన్ని నిజాయితీగా చెప్పేవాడు. అతని చిత్రాలలో ఒక్క 'లేడి,హంస' అన్న చిత్రంలో తప్ప మరి దేనిలోనూ స్త్రీనగ్నత్వాన్ని చిత్రీకరించ లేదు. ప్రతి కళాకారుడు విధిగా శాస్త్రజ్ఞుడు కావలసి ఉంటుందని అభిలషించాడు.

**మూడవ అట్టపై చిత్రం :**

వర్జిన్ అండ్ చైల్డ్ విత్ సెయింట్ అనె అండ్ ది లాంబ్ : ఈ చిత్రాన్ని 1495వ సంవత్సరంలో మొదలు పెట్టి 1506వ సంవత్సరములో పూర్తిచేశాడు. ఈ చిత్రంలో కుడివైపున వున్న బాలుడు జీసస్ . ఈ చిత్రాలలో అతని లయాత్మకమైన క్లాసికల్‌శైలి కనబడుతుంది. ఈ చిత్రం వేయడానికి ముందు ఎట్టటి సుద్దతో దీని చిత్తు ప్రతినొకటి తయారు చేశాడు. అది అసంపూర్ణంగా మిగిలిపోయింది. అది అసంపూర్ణంగా మిగలటం వల్లనే అతని రేఖా విన్యాసాన్ని మనం స్పష్టంగా చూడగలుగు తున్నాము. ఈ చిత్రం 18 వ శతాబ్దంనుండి 1962 వరకు రాయల్ అకాడమీ ఆధ్వర్యంలో ఉండేది. ఇంగ్లండ్ దేశపు ప్రజలు దీనిని అందరూ చూడడానికి వీలుగా చందాలు వేసుకొని రాయల్ అకాడమీ నుంచి కొనుగోలు చేసి ప్రస్తుతం లండన్ లోని నేషనల్‌గ్యాలరీలో ఉంచారు.

**నాల్గవ అట్టపై చిత్రం :**

ది లాస్ట్ సప్పర్: మిలాన్ పట్టణంలోని శాంత మారియా చర్చిలోని గోడపై వేయబడ్డ కుడ్య చిత్రమది. డావిన్సీ పేరు చెబితే వెంటనే మన మనోఫలకంలో స్ఫురించే చిత్రాలలో ఒకటి. యెహోవా ''నాశిష్యులలో ఒకరు నన్ను మోసగించ బోతున్నారని'' చెప్పే సన్నివేశమిది. ఈ సంఘటను ఆనాటి నుంచి ఈ నాటి వరకూ అనేక మంది చిత్రకారులు(సాల్వడార్ డాలీతో సహా) వేశారు. కానీ ఏ ఒక్క చిత్రం డావిన్సీ చిత్రంలోని ప్రగాఢమైన సున్నిత భావాలకు దరిదాపులకు రాలేదని భావిస్తారు. దీనిలో ఒక్కొక్క వ్యక్తికి ఒక్కోరకమైన వేషం, భావం, రూపం వుంది. మామూలుగా కుడ్య చిత్రాలు వేసే టపుడు తడిగా వున్న గోడపై ఆరంగులను పీల్చుకునే తత్వంగల మాధ్యమాన్ని వాడవలసి వుంది. అయితే నిరంతర ప్రయోగశాలైన డావిన్సీ సాహసించి తైలాలను మాధ్యమంగా ఉపయోగించాడు. గోడల లోనికి చొచ్చుకు పోకుండా దట్టంగా వున్న ఈ తైలాల వలన ఈ చిత్రం అతి స్వల్ప కాలంలోనే (ఈ చిత్రం వేసిన50 సంవత్సరాలకే) రంగులు పొక్కిపోయి రాలి పోయాయి. 1955వ సంవత్సరంలో ఈ చిత్రం మరింత శిధిలం కాకుండా దీనిని పునరుద్ధరించారు.

# మిథ్యాభిమాన్ - కన్యాశుల్కము

- డా. యు.ఎ.నరసింహమూర్తి

ఆధునికగుజరాతీ నాటకాలలో నేటికీగొప్ప నాటకంగా పరిగణింపబడేదేది? అన్న ప్రశ్నకు గుజరాతీ పండితులు, విమర్శకులు ముక్తకంఠంతో ''మిథ్యాభిమాన్'' అని సమాధానం చెప్తారు. తెలుగు వారు కూడా ఇంతవరకు తెలుగులో వచ్చిననాటకాలలో గొప్ప నాటకం ఏది? అన్న ప్రశ్నకు ''కన్యాశుల్కము'' అని తడుముకోకుండా బదులిస్తారు. ఈ రెండు నాటకాలను పోల్చి చూడడంలో గల కారణాలలో ఇది ఒకటి. కన్యాశుల్కం నాటకం గొప్పదనాన్ని గుర్తించి తొలిరోజుల నుంచి ఇప్పటిదాకా దానిని ప్రదర్శిస్తూనే ఉన్నా మధ్యలో కొన్ని దశాబ్దాల కాలం గురజాడ గొప్పదనాన్ని తెలుగువారు గుర్తించనట్లుగానీ, మరచిపోయినట్లుగానీ కనిపిస్తుంది. గుజరాతీలో సరిగా ఇందుకు విరుద్ధమైన సంఘటన జరిగింది. గుజరాతీ వారు దళ్‌పత్‌రామ్ జీవితకాలమంతా ఆయనను ''కవి దళ్‌పత్‌రామ్'' అని గౌరవించి, అందలమెక్కించారు. ఆయన రచనలన్నింటిని తలదాల్చారు. ఆయన ఇతర నాటక సమాజాలకు రాసిన నాటకాలన్నింటినీ తండోపతండాలుగా దర్శించారు. కానీ ఏ మిథ్యాభిమాన్ నాటకాన్ని ఇప్పుడు గుజరాతీ నాటకాలలో కెల్లా గొప్పదని ప్రశంసలు కురిపిస్తున్నారో ఆ ''మిథ్యాభిమాన్'' నాటకాన్ని దళపత్‌రామ్ జీవితకాలంలో ఒక్కడు కూడా కన్నెత్తి చూడలేదు. 1871లో రచింపబడిన ఆ నాటకాన్ని 1946లో తొలిసారి ప్రదర్శించారు. ఒకచోట కవిని నిరాదరిస్తే ఇంకొక చోట కవి సృష్టించిన నాటకం నిరాదరణకు గురియైంది. ఇప్పుడు ఆ కవికి బ్రహ్మరథం పడుతున్నారు. ఆ నాటకానికి జేజేలు పలుకుతున్నారు. దీనిని బట్టి సమకాలీన భావధారకు గల ప్రాబల్యమెంతటిదో తెలుస్తోంది.

**దళ్‌పత్‌రామ్:**

ఆధునిక తెలుగు సాహిత్యానికి వీరేశలింగం, గురజాడ ఎలాంటివారో, ఆధునిక గుజరాతీ సాహిత్యానికి నర్మద్, దళపత్‌రామ్ అటువంటివారు. వీరిలో దళపత్‌రామ్ మొదటివాడు (1820-1898). దళ్‌పత్‌రామ్ ప్రాచీనతకు భరతవాక్యం పలికాడని, నర్మద్ నవ్యతకు నాందీవాచకం పలికాడని గుజరాతీలు భావిస్తారు. కానీ యథార్థానికి దళ్‌పత్‌రామ్ రచించిన కావ్యం ''బాపానీ పీన్‌పార్'' (తాతల నాటి రావి చెట్టు) తో గుజరాతీ సాహిత్యంలో నవ్య యుగోదయమైందని చెప్పాలి. ఆధునిక తెలుగు సాహిత్యానికి వీరేశలింగాన్ని యుగపురుషుడుగా అభివర్ణించినగురజాడను ''వేగుచుక్క'' అనీ, అడుగు జాడ గురజాడది అనీ అనేకులు శ్లాఘించారు. దళ్‌పత్‌రామ్ మొదట హిందీలోనే వ్రజ్ మాండలికంలో రాసేవాడు. ''అలెగ్జాండర్ కిన్‌లాక్ ఫోర్బ్స్''కు గుజరాతీ నేర్పడంతో దళ్‌పత్‌రామ్‌కు గుజరాతీలో రాయాలనే అభినివేశం కలిగింది. గురజాడ ముందుగా ఇంగ్లీషులో రచనలు చేసేవాడు. ఆనందగజపతి మహారాజు ప్రేరణతో ''కన్యాశుల్కం'' నాటకరచన ఆరంభించిన తరువాత, అతనికి క్రమంగా తెలుగు రచనల పట్ల దృష్టి మరలింది. దళ్‌పత్‌రామ్ కంటే గురజాడ ఇంగ్లీషులో బాగా పండితుడు. ప్రపంచ సాహిత్యాన్ని ఆకళించుకున్నవాడు. దళ్‌పత్‌రామ్ పద్యవిద్యలో ఆరితేరినవాడు. అందుకే ఆయనకు ''కవీశ్వరుడు'' అనే బిరుదు లభించింది. ''గుత్తునా ముత్యాలసరములు,

---

డా. యు.ఎ. నరసింహమూర్తి, విజయనగరం, మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా పదవీ విరమణ చేసి, అక్కడే యు.జి.సి. ఎమిరిటస్ రీసెర్చి ఫెలోగా ఉంటున్నారు.

కూర్చుకుని తేటైన మాటల'' అంటూ గురజాడ కొత్త ఛందస్సును, కొత్త కవితా మార్గాన్ని ఆవిష్కరించి అభ్యుదయ వాదులందరి చేత ''మహాకవి'' అని కీర్తింపబడ్డాడు. గుజరాతీ వారికి కవి దళ్‌పత్‌రామ్ అనడం అలవాటైనట్లే, తెలుగువారికి ''మహాకవి గురజాడ'' అనడం అలవాటైంది. బ్రిటిషు వారు దళ్‌పత్‌రామ్‌కు C.I.E. (Companion of Indian empire) అనే బిరుదు ఇచ్చారు. గురజాడను కూడా కొందరు విమర్శకులు బ్రిటిష్ పక్షపాతిగా గుర్తించారు. యథార్థానికి వీరిద్దరికి ఇంగ్లీషువారి సంస్కృతి పట్ల, కార్య నిర్వహణ రీతి పట్ల గౌరవముంది. వారి విద్యలు సత్యమార్గాన్ని నిర్దేశిస్తాయని వీరిద్దరూ విశ్వసించారు. ''కన్ను గానని వస్తుతత్త్వము కాంచనేర్పరు లింగిరీజులు - వారి విద్యల గరచి సత్యము నరసితిన్'' అంటూ గురజాడ ప్రకటించిన గౌరవభావం దళ్‌పత్‌రామ్‌కు కూడా ఉంది. అందువలన వారి దేశభక్తిని శంకించడానికి వీలులేదు. 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో జాతీయభావ పూరితులైన మహానాయకులు కొందరు పాశ్చాత్య సంస్కృతి పట్ల, వారి విద్యల పట్ల ఈ విధమైన గౌరవాన్ని ప్రకటించినవారే. ''అన్ని దేశాలు క్రమ్మవలెనోయ్ - దేశిసరుకుల నమ్మవలెనోయ్'' అంటూ గురజాడ స్వదేశీ ఉద్యమం పట్ల తనకు గల నిబద్ధతను ప్రకటిస్తూ నినదించాడు. దళ్‌పత్‌రామ్ అందుకు కనీసం అర్ధ శతాబ్ది కాలం ముందుగానే బ్రిటిషు వారి ప్రమేయంతో పెరిగిపోతున్న యాంత్రిక నాగరికతను నిరసిస్తూ ఆ కారణంగా నశించిపోతున్న స్వదేశీ వస్తూత్పత్తిని గూర్చి వ్యధ చెందుతూ ప్రతీకాత్మకంగా ''హన్నర్‌ఖాన్ ఛడాయి'' అనే దీర్ఘ కవితను ప్రబోధాత్మకంగా రచించాడు.

ఆరిస్టోఫేన్స్ "Plots" అనే నాటకాన్ని రాసాడు. దాని ఆంగ్లానువాదాన్ని అనుసరించి దళ్‌పత్‌రామ్ ''లక్ష్మి'' నాటకాన్ని రాసాడు. మూల నాటకంలోని గ్రీకు ధనాధిదేవత Plots ను లక్ష్మిగా పునస్సృజన చేసినట్లుగా దళ్‌పత్‌రామ్ తన పీఠికలో పేర్కొన్నాడు. "Thus, Dalpatram introducing in Lakshmi the spoken tongue in place of the contemporary Gujarati dramatic jargon assumes revolutionary significance as an event.[1] అన్న ప్రామాణిక విమర్శకుల మాటలు గురజాడకు నాలుగు దశాబ్దాలకు పూర్వమే దళ్‌పత్‌రామ్ తన తొట్టతొలి నాటకంలో మాండలిక భాషను ఉపయోగించి, విప్లవాత్మకమైన పరిణామానికి నాందీవాచకం పలికేడని రూఢి చేస్తున్నాయి.

1856లో కవి దళ్‌పత్‌రామ్ రచించిన ''స్త్రీ సంభాషణ్'' అనే నాటకం స్వతంత్రమైనది. దానిని అధ్యాయాలుగా విభజించడం, కథన శైలిని అవలంబించడం కారణంగా అందులోని నాటకీయత దెబ్బతింది. దైనందిన సంభాషణలలోని భాషను ఉపయోగించడం ద్వారా దళ్‌పత్‌రామ్ 'లక్ష్మి' నాటక నిర్వహణలో సాధించిన వేదనలన్నింటిని ఇందులో కూడా చూపించ గలిగేడు. సమకాలీన సమాజంలోని మనోవృత్తులన్నీ ''స్త్రీ సంభాషణ్'' లో పీసంవాసి పొల్లుపోకుండా ప్రతిబింబిస్తాయి. గురజాడలాగే దళపతిరామ్ దృష్టి కూడా మొదటి నుండి స్త్రీ సమస్యల పట్ల కేంద్రీకృతమైనదనడానికి ఈ నాటకం ఒక సాక్ష్యం. 1870లో కవి దళ్‌పత్‌రామ్ ''రుస్తుమ్ షోహరాబ్'' నాటకానికి పాటలను సమకూర్చాడు. ఒక ప్రముఖ కవి, సాహిత్యకారుడు నాటకాలతో సంబంధాన్ని కలిగి ఉండడం ఇదే మొదటిసారి. తెలుగునాట గురజాడ సమకాలికులైన కవులు, నాటకకర్తలు కొందరు ఈ విధంగా చేసినవారున్నారు. గురజాడ మాత్రం ఎన్నడూ వృత్తి నాటక సమాజాలనూ వారు ప్రదర్శించే నాటకాలనూ గౌరవించలేదు. కవిగా, నాటకకర్తగా నాటక సమాజాలకు ఉపయోగపడలేదు.

**మిథ్యాభిమాన్:**

మిథ్యాభిమాన్ - కన్యాశుల్కం నాటకాలు రెండూ ఆ నాటక కర్తలు తమంతటతాముగా వ్రాసినవి కావు. ఆ రెండింటికీ ప్రేరణలు ఉన్నాయి. విజయనగర సంస్థానాధీశ్వరుడయిన ఆనందగజపతి మహారాజు కన్యాశుల్కాన్ని నిషేధిస్తూ మద్రాసు శాసనసభలో ఒక చట్టాన్ని తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా తమ ప్రాంతంలోని కన్యాశుల్క వివాహాల వివరాలను సేకరించాడు. ఆ సందర్భాన్ని గురజాడ తమ మొదటి కన్యాశుల్కం పీఠికలో ఈ విధంగా వివరించాడు. ''విశాఖపట్నం జిల్లా సామాన్య ప్రాంతంలో మూడేళ్ళలో జరిగిన బ్రాహ్మణ కన్యాశుల్క వివాహాల పట్టీని పదేళ్ళ క్రితం ఘనత వహించిన విజయనగరం మహారాజుగారి ఉత్తర్వుపై తయారు చేసారు. కన్యాశుల్కం తీసుకున్నట్లు ఒప్పుకోవడానికి అందుకు సంబంధించిన వ్యక్తులు సిద్ధంగా లేనందున (ఇది సహజమే) ఈ పట్టీ అసమగ్రం. కాని తయారయిన పట్టీ సహితం ఎంతో విలువైన ముఖ్యమైన పత్రం. నమోదయిన ఈ వివాహాల సంఖ్య 1034. అంటే సగటున ఏడాదికి ఇటువంటి వివాహాలు 344 జరిగాయన్నమాట. 99 మంది పిల్లలకు ఐదేళ్ళ వయస్సులో, 44 మందికి నాలుగేళ్ళ వయస్సులో, 4 మందికి మూడేళ్ళ వయస్సులో, 6 గురికి రెండేళ్ళలో, ముగ్గురికి ఏడాదిలోనే పెళ్ళి చేసారు. ఏడాది శిశువులు ఒక్కొక్కరికి చెల్లించిన ధర 350/ - 400/ - రూపాయిలు. చిత్రం అనిపించవచ్చు. కానీ, కొన్ని సందర్భాలలో కడుపులో ఉన్న పిల్లలకు కూడా బేరం కుదుర్చుకున్నారు. ఇంతటి ఘోరమైన పరిస్థితి సమాజానికి సిగ్గుచేటు. ఇటువంటి దురాచారాన్ని ఎండగట్టి ఉన్నతమైన నైతిక ప్రమాణాలను వ్యాపింపచేయడానికి మించిన కర్తవ్యం సాహిత్యానికి మరొకటి లేదు. ప్రజా బాహుళ్యానికి పుస్తక పఠనం అలవాటయ్యేదాకా అలాంటి ఆరోగ్యకర ప్రభావ వ్యాప్తికై నాటకరంగాన్ని ఆశ్రయించవలసి వుంటుంది. ''కన్యాశుల్కం'' నాటక రచనకు నన్ను ప్రేరేపించినది ఇదే.''

''మిథ్యాభిమాన్'' నాటక రచనకు ప్రేరణ ఇంకొక విధంగా ఉంది. క్రీస్తు శకం 1869లో, సమాజాన్ని ఉద్ధరించాలనే స్పష్టమైన ఉద్దేశ్యంతో స్వర్గీయ ఠక్కర్‌గోవింద్‌జీ ధర్మశీ ఆదేశించినందువల్ల గుజరాత్ వర్నాక్యులర్ సొసైటీ, బుద్ధిప్రకాశ్, గుజరాత్ శీలాపత్ర్, ముంబాయి, ''శాస్త్రగోఫతార్'', సండే రివ్యూ, దాండియో సూరత్‌కి చెందిన గుజరాత్ మిత్ర మరియు అహమ్మదాబాద్ సమాచార పత్రికలలో ''పోటీ'' గురించి అచ్చువేయించిన విజ్ఞాపన ఈ విధంగా ఉంది :

''ఏ విధమైన విద్య, ధనం, గుణం తనలో లేనప్పటికీ ''నాలో ఉంది'' అని గొప్పలు చెప్పుకుంటూ దంభాలు పలికేవాడిని ''మిథ్యాభిమాన్'' అంటారు. మిథ్యాభిమాని గురించి, హాస్యరసంతో, నాటక రూపంలో, నిబంధాన్ని, ''బుద్ధి ప్రకాశ్'' పత్రిక పేజీ సైజులో 50 పేజీలు ఐదు నెలలలోగా వ్రాసి పంపండి. అలాంటి నాటకాలలో సర్వ శ్రేష్ఠమైన కృతికి గోవింద్‌జీ ధర్మశీ గారి తరపున వంద రూపాయలు బహుమతి ఇవ్వబడుతుంది.'' సహజంగానే సంఘ సంస్కరణ పట్ల ఆసక్తుడై ఉన్న దళపత్‌రామ్‌ను ఈ విజ్ఞాపన ఆకర్షించింది. ఆయన ''మిథ్యాభిమాన్'' నాటకాన్ని రచించి 1870లో బహుమతి పొందాడు. 1871లో ఈ నాటకం ప్రచురించబడింది. ప్రదర్శనకు నోచుకోకపోయినా పాఠకులను బాగా ఆకట్టుకుంది. ''కన్యాశుల్కం'' నాటకాన్ని గురజాడ మళ్ళీ మళ్ళీ మార్చి వ్రాసినట్లే దళపత్‌రామ్ కూడ ''మిథ్యాభిమాన్''ను మార్పులు కూర్పులు చేసి పునర్ముద్రణ చేయించాడు.

కన్యాశుల్కం నాటకం ముఖపత్రం మీదనే 'హాస్యరస ప్రధానమైన నాటకము' అని ఉంటుంది. ఇది నాటకకర్త స్వచ్ఛందంగా అనుసరించిన రచనా మార్గము. మిథ్యాభిమాన్ కూడా హాస్యరస ప్రధానమైన నాటకమే. దీనిని గుజరాతీ వారు ప్రహసనమని భావించారు. ఇది గుజరాతీలో మొదటి ప్రహసనమని పేర్కొన్నారు. ఇది రచయిత స్వచ్ఛందంగా ఎన్నుకొన్న రచనా మార్గము మాత్రము కాదు. పోటీకి ఏర్పరచిన నిబంధనలలో ఒకటి. నాటకం పేరు కూడా పోటీ నిబంధనలలో పేర్కొనినదే. అంతేకాదు, పాత్ర లక్షణం కూడా ప్రధానంగా పోటీ నిబంధనలో పేర్కొనబడింది. ఆ మార్గదర్శక సూత్రాలను బట్టే దళపత్ రామ్ ''జీవరామ్ భట్'' అనే పాత్ర చిత్రణ ప్రధాన అంశంగా, హాస్య రసభరితమైన రచన చేసాడు. ఇటువంటి నిబంధనలేవీ లేకపోయినా గురజాడ కన్యాశుల్కాన్ని పాత్ర చిత్రణ ప్రధాన ధ్యేయంగా రచించాడు. ఆధునిక భారతీయ సాహిత్యకారులకు పాత్ర చిత్రణలో పాఠాలు నేర్పినవాడుగా ప్రసిద్ధ ఒరియా నవలాకారుడు ఫకీర్‌మోహనసేనాపతి ప్రశంసలు పొందారు. ''ఛొమణొ అఠొగుంఠొ'' అనే నవలలోని పాత్ర చిత్రణ ద్వారా ఈ ఖ్యాతి ఆయనకు లభించింది. ఆ విషయాన్ని అలా ఉంచితే 19వ శతాబ్ది ఆధునిక భారతీయ సాంఘిక నాటకాలలో మూడు అజరామర పాత్రలను సృష్టించడం ద్వారా ముగ్గురు నాటకకారులు ప్రఖ్యాతి చెందారు. అందులో సదావర్ ఏకాదశి అనే ప్రహసనంలో నీమ్ చంద్ దత్తా అనే పాత్రను కల్పించిన దీనబంధుమిత్ర (1831-1873) మొదటివాడు. మిథ్యాభిమాన్ నాటకంలో జీవరామ్ భట్ పాత్ర సృష్టించిన దళపత్‌రామ్ రెండవ వాడు. కన్యాశుల్కంలో గిరీశం పాత్రను సృష్టించిన గురజాడ మూడవవాడు. ఈ మూడు పాత్రలు జీవలక్షణాలలో తేడాలున్నా ముగ్గురి మధ్య అంతర్లీనంగా కొన్ని పోలికలు లేకపోలేదు. ఆ పోలికలకు ఆనాటి కాలమే కారణమని భావించాలి. ఈ పోలికలను తగు మాత్రంగా విశ్లేషించవలసిన అవసరం ఉంది.

మిథ్యాభిమాన్, కన్యాశుల్కం నాటకాలు రెండూ బాలికలను పెళ్ళి పేరుతో ముసలివాళ్ళకు డబ్బు కోసం అమ్ముకొనే దురాచారాన్ని ఖండించడం కోసం రాసినవే. కానీ ఈ రెండింటికి నిర్వహణలో చాలా భేదముంది. కన్యాశుల్కం నాటకం మొదలు కాకుండానే అందులో జరగవలసిన ఘోరాలన్నీ జరిగిపోయాయి. అగ్నిహోత్రావధాన్లు మేనత్తలందరికీ కన్యాశుల్కం తీసుకునే పెళ్ళిళ్ళు చేసేసారు. వాళ్ళ బ్రతుకు లేమయ్యాయో నాటకంలో కనిపించదు, వినిపించదు. కానీ నాటకం మొదలు కాక పూర్వమే కన్యాశుల్కం దురాచారానికి బలైపోయిన పూటకూళ్ళమ్మ, బుచ్చమ్మ, మీనాక్షిల దుర్భరజీవితం నాటకమంతటా పరుచుకొని ఉంది. నాటకం మొదలైనప్పటి నుండీ తుదివరకు బలంగా కొనసాగిన ప్రయత్నమొక్కటే. అది అగ్నిహోత్రావధాన్లు రెండవ కుమార్తె అయిన 'సుబ్బి' అనే బాలికకు కాటికి కాలు చాపుకొన్న లుబ్ధావధాన్లు అనే ముసలివాడితో పెళ్ళి జరగకుండా ఆపు చేయడానికి చేసిన ప్రయత్నం. ఇందులో ప్రధానపాత్ర 'సుబ్బి'. ఆ పాత్ర నాటకంలో ఎక్కడా కనబడదు. మిథ్యాభిమాన్ నాటకంలో ఈ కథాంశం ఇంకొక విధంగా ఉంది. యమున రఘునాథభట్టు కుమార్తె. ఆ పిల్ల వ్యక్తురాలు కాకుండానే కన్యా విక్రయం చేసిన కారణంగా ఏర్పడిన దుర్దశ నంతటినీ ఈ నాటకం హాస్యపూరితంగా వెలువరించింది. ఎనిమిది అంకాల మిథ్యాభిమాన్ నాటకంలో యమున ఒకే ఒకసారి మెరుపు మెరిసినట్లుగా కనిపించి, తనగోడు వెళ్లబోసుకొని వెళ్ళిపోతుంది. ఆ తరువాత మరెక్కడా కనబడదు. బాధలకు లక్ష్యమైన ప్రధాన పాత్రను మరుగుపరచిన నాటకశిల్పం, రెండు నాటకాలలోను సమాన

అంశంగా కనిపిస్తుంది. ఈ శిల్ప నిర్వహణలో గురజాడ ప్రదర్శించిన ప్రజ్ఞాపాటవము ఆధునిక భారతీయ నాటక చరిత్రలో ఇంకొకచోట లేనేలేదని నిస్సంశయంగా చెప్పవచ్చును.

''మిథ్యాభిమాన్'' నాటకం గుజరాతీ నాటక సంప్రదాయాన్ని విస్తృతంగా ప్రదర్శించే లక్షణాలతో నిండి ఉంది. అసలు సిసలైన గుజరాతీ నాటకం ఎలా ఉండాలో, దాని వాస్తవ లక్షణాలేమిటో 1871 నుండి ''మిథ్యాభిమాన్'' గుజరాతీ నాటక రంగానికి సూత్రప్రాయంగా చెప్పింది. దంభాచారంతో లోపాలు కప్పిపుచ్చుకొనే జీవరామ్‌భట్ తన అత్తవారింటికి ప్రయాణించడంలోని విశేషాలను కవి దళపత్‌రామ్ ఈ నాటకంలో వర్ణించాడు. అతనికి రేచీకటి ఉంది. కాని ఆ విషయాన్ని అతడు అంగీకరించడు. రాత్రి కూడా తనకు కనిపిస్తున్నాదన్నట్లుగా జరిగే అవకతవకలతో అందరికీ నవ్వు పుట్టిస్తాడు. అడవిలో ప్రయాణిస్తున్నప్పుడు, అత్తవారింటిలో ఉన్నప్పుడు ఇటువంటి సంఘటనలు జరిగాయి. అతని నటనలు కారణంగా చివరకు పొరపాటున పోలీసులు చేతిలో పడి ఒళ్ళు కమిలిపోయేలా దెబ్బలు తిన్నాడు. సమకాలీన నాటక సంప్రదాయాన్ని అనుసరించి జీవరామ్ భట్ కథనంతో సమాంతరంగా ''వాఘ్జి అణె కుతుబ్‌మియాన్'' (Vaghji Ane Kutubmiyan) అనే వృత్తాంతం కూడా నడుస్తుంది. ఈ నాటకం జీవరామ్‌భట్‌కు సంబంధించిన దుష్పరిణామాలను ప్రదర్శించడంతో మిథ్యా ప్రవర్తన వలన కలిగే అనర్థాలను గూర్చి బోధించింది. గుజరాతీలో ఇది మొట్టమొదటి ప్రహసనం కావడం గణుతించదగిన విషయం.

నాంది, ప్రస్తావన, సూత్రధారుడు, ఆత్‌అంక, అంక శీర్షిక్ మొదలైన అంశాలు ఈ నాటకంపై గల సంస్కృత నాటక లక్షణ ప్రభావాన్ని విశదం చేస్తాయి. ఈ అష్టాంక నాటకంలోని మొదటి అంకంలో రేచీకటిగల జీవరామ్‌భట్టు మరియు ఇద్దరు గొర్రెల కాపరులు వస్తారు. రెండవ అంకంలో జీవరామ్‌భట్టు మామగారైన రఘునాథ భట్టు, బావమరిది సోమనాథ భట్టు, అత్తగారు దేవబాయి, జీవరామ్ భట్టు భార్య యమున, ఆమె స్నేహితురాలు గంగ వీరంతా వస్తారు. మూడవ అంకంలో జీవరామ్‌భట్టును వెదకడానికి అతని మామ, బావమరిది ఇద్దరూ వెళతారు. నాల్గవ అంకంలో జీవరామ్‌భట్టు తన అత్తవారి పరివారంతో కలుస్తాడు. ఐదవ అంకంలో ఒక ఫార్స్ చూపించడానికి వాఘ్జిరాజపుత్రుడు మరియు కుతుబ్‌మియా కుస్తీ పడతారు. ఆరవ అంకంలో రఘునాథభట్టు ఇంటి నుండి దొంగలు పట్టుబడతారు. ఏడవ అంకంలో క్రిమినల్ కోర్టు చూపించబడుతుంది. ఎనిమిదవ అంకంలో జీవరామ్‌భట్టుకు ఔషధాన్నివ్వడానికి వైద్యుడు ఒకడు వస్తాడు.

''మిథ్యాభిమాన్'' లో కథ కొన్ని గంటల సేపు నడిచింది. కన్యాశుల్కంలో కథ కొన్ని పక్షాలు పట్టింది. ఈ రెండు నాటకాల ఉన్నతికి గల ప్రధాన కారణాలు హాస్యము, పాత్ర చిత్రణ అని విమర్శకులంతా అంగీకరించారు. రెండు నాటకాలూ ఆద్యంతమూ హాస్యరస భరితంగా నడిచాయి. కానీ మౌలిక లక్షణాలననుసరించి ఈ రెండు నాటకాలలోని హాస్యం పరిపూర్ణంగా భిన్నమైనది. మిథ్యాభిమాన్ నాటకమంతటా గుజరాతీ సంప్రదాయక మార్గాన్ని అనుసరించిన హాస్యమే కల్పించబడింది. శ్లేషగర్భితాలైన సంభాషణల కంటే మిథ్యాభిమాన్‌లోని సంఘటనల కారణంగానే ఎక్కువగా హాస్యం పుట్టింది. జీవరామ్‌భట్టు గేదె తోక పట్టుకొని ప్రయాణించడం, ఆ కారణంగా గోతిలో పడి మామగారు, బావమరిది వచ్చేదాకా అక్కడ నుండి కదలకుండా ఉండి తనంతట తానే

అందులో పడుకొని ఉన్నట్లుగా చెప్పడం, అత్తగారు పళ్ళెంలో వడ్డించిన పదార్థాన్ని ఆవు దూడ వచ్చి తినేయడం, మళ్ళీ అత్తగారు వడ్డనకు వచ్చినప్పుడు ఆవుదూడ అనుకొని అత్తగారి ముఖం మీద ఫడీమని తన్నడం, రాత్రి లఘుశంకకు లేచినపుడు తన తలపాగా విప్పుకొని మంచం కోడుకు, నడుముకు కట్టుకొని పెరట్లోకి వెళ్ళడం, మధ్యలో ఆవు దూడ ఆ తలపాగా కొరికేయడం, తిరిగి వచ్చేటప్పుడు చీకట్లో కనబడక అత్తగారి మంచం మీద పడడం, ఆమె గాబరాలో జీవరామ్‌భట్టును గుర్తించక దొంగలు, దొంగలు అని అరవడం, యింట్లోవారు, బయటివారు జీవరామ్‌భట్ స్వరాన్నైనా గుర్తించక అందరూ అతనిని చావగొట్టడం వంటి సంఘటనలన్నీ హాస్యజనకాలే. అయినా సహజంగా లేవు. ముదురు పాకంలో పడిన ఈ తరహా ముతక హాస్యం తెలుగులో బ్రహ్మవివాహం, కంఠాభరణం, వర విక్రయం వంటి నాటకాలలో కనిపిస్తుంది. ఆ నాటకాలు వ్రాసిన రోజులలో ఆ హాస్యం ప్రజాదరణ పొందినా కాలం గడుస్తున్నకొద్దీ తెలుగులో దానికి ఆదరణ తగ్గింది. సహజం, సున్నితం అయిన హాస్యాన్ని గౌరవించినట్లుగా ఆధునికులు సంప్రదాయసిద్ధం, జానపద భూమిక నుండి పుట్టినది అయిన హాస్య ధోరణిని ఆదరించడంలేదు. గురజాడ మైఖేల్ మధుసూదన దత్తా తరువాత అంతగా ప్రపంచ సాహిత్యాన్ని ఆకళించుకున్న ఆధునికుడు. దళపత్‌రామ్‌లాగా కొన్ని విషయాలలోనైనా సంప్రదాయంతో రాజీ పడే ధోరణిగురజాడకు లేనే లేదు. ఆయన నాటకంలోని హాస్యమంతా మృదువైన సహజమైన సంభాషణ నుండి పుట్టినది. ఒకచోట కూడా బలవంతంగా హాస్యాన్ని సృష్టించినట్లు కనబడదు. సహజత్వానికి భిన్నమైన సన్నివేశమే కన్యాశుల్కంలో కనబడదు. దుర్భరమైన సన్నివేశాలలో కూడా కటువైన మాటగాని, కఠినమైన చర్యగాని కన్యాశుల్కంలో కనబడదు. వేదనంతా వెనుకనున్నా వేదికమీద హాస్యపు వెన్నెల కురుస్తూనే ఉంటుంది. ఈ తరహా హాస్య కల్పనలో ఆధునిక భారతీయ నాటకాలలో కన్యాశుల్కమే గొప్పదని ఎవరైనా అంగీకరిస్తారు.

గుజరాతీ నాటకారులు గంభీరమైన నాటకాలను ప్రదర్శించేటప్పుడు ప్రేక్షక హృదయాలను తేలిక పరచడానికి నాటకాంతంలో ఒక ప్రహసనాన్ని ప్రదర్శించే వాడుక ఉంది. మిథ్యాభిమాన్ అడుగడుగునా కడుపుబ్బ నవ్వించే హాస్య ప్రధానమైన నాటకమే అయినా సమకాలీన నాటకరంగ మర్యాదను మన్నిస్తూ దళపత్‌రామ్ ఈ నాటక మధ్యంలో ఒక లఘు ప్రదర్శనను ప్రవేశపెట్టాడు. పాశ్చాత్య నాటక సంప్రదాయంలో "Farce" అన్న పదానికి బదులుగా దళపత్‌రామ్ ''ఉపనాటకం'' అని వ్యవహరించాడు. నాట్యశాస్త్రంలో రూపకాలు, ఉపరూపకాలు అను విభజన ఉంది. ఆ విభజనను దృష్టిలో పెట్టుకొనే గుజరాతీలు "Farce" ను ఉపనాటకమని వ్యవహరించారు. మిథ్యాభిమాన్‌లో పంచమాంకమంతా ఉపనాటకమే. కథను దృష్టిలో పెట్టుకొని చూస్తే నాటకంలోని ప్రధానకథకు, ఈ ఉపకథకు ఏవిధమైన సంబంధం లేకుండా, ''తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదం'' అన్న రీతిగా కనిపిస్తుంది. కాని ఇందులోని పాత్ర చిత్రణము, వస్తు విన్యాసం ప్రధాన కథలోని జీవరామ్‌భట్టు పాత్రను, కన్యావిక్రయాన్ని అధిక్షేపించే విమర్శ మార్గంలో కనిపిస్తుంది. ఈ ఉపనాటకంలో కుతుబ్‌ఖాన్, వాఘ్‌జీ అనే ప్రధాన పాత్రలు కనిపిస్తాయి. కుతుబ్‌ఖాన్ మహమ్మదీయుడు. వాఘ్‌జీ ఠాకూరు. మిథ్యాభిమాన్ ''భవాయ్'' సంప్రదాయాన్ని అనుసరించడం చేత గాయకుల పాటల ద్వారా ఈ పాత్రలను ప్రవేశపెట్టాడు. భారతీయ జానపద దృశ్య కళారూపాలన్నిటిలోను ప్రధాన కథకు, ప్రధాన పాత్ర చర్యలకు, సంభాషణలకు ఒక వ్యాఖ్యాత ఉంటాడు. భవాయ్ సంప్రదాయంలో ఆ వ్యాఖ్యాత పేరు ''రంగలా''.

రంగలా వ్యాఖ్యానం హాస్యమార్గంలో నడుస్తుంది. దళపత్‌రామ్ ఉపరూపకంలో కూడా రంగలా పాత్రను ప్రవేశపెట్టాడు. రంగలా ప్రధాన నాటకంలో జీవరామ్‌భట్టు చేష్టలను, సంభాషణలను అధిక్షేపిస్తూ విమర్శనాత్మకమైన వ్యాఖ్యానాన్ని కొనసాగించినట్లే ఉపరూపకంలో కూడా కుతుబ్‌ఖాన్ చేష్టలను, మాటలను అధిక్షేపిస్తూ వ్యాఖ్యానం కొనసాగిస్తాడు. జీవరామ్‌భట్టులాగే కుతుబ్‌ఖాన్ ఆత్మస్తుతి పరాయణుడు, డాంబికాలు పలికేవాడుగా కనిపిస్తాడు. కాని స్వభావం చేత అతడు పిరికివాడు. పులులతో పోరాటం చేస్తానని బీరాలు పలికిన కుతుబ్‌ఖాన్ దాహం తీర్చుకోవడం కోసం బావిదగ్గరకు వెళ్ళి కప్పల బెకబెకలు విని భయపడి వెనక్కి వచ్చేస్తాడు. నీరు తాగకుండా వచ్చావేమని వాఘ్‌జీ అడిగితే ఆ బావిలో పులులు గాండ్రిస్తున్నాయని బదులిస్తాడు. అతని శీలానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే. రంగలా వ్యాఖ్యానంతో అతని స్వభావం యింకా తేటపడుతుంది.

రంగలా : **ఉపజాతివృత్తం**

స్వశక్తి ఎలాంటిదో తెలియదు వారికి
తమగురించి ఎన్నో గొప్పలు చెప్పుకొంటారు
మిథ్యాభిమానులు గొప్పలు చెప్పుకొంటారు తప్ప
అవసరం కలిగినపుడు మాత్రం ముందుకు రాలేరు వారు

రంగలా : **ద్విపద**

చెర్నాకోలాను చూసి అయ్యో అని ఉలికిపడతాడు
ఐనా చెప్పుకొంటాడు తనకుతాను రాజపుత్రుడనని
భావాంతరంలో వైశ్యుడు కప్ప చప్పుడునే భూతమంటాడు.
మరిపుడు రాజపుత్రుని కొడుకు పిరికివాడిలా వింటూ ఉండలేడుగదా

రంగలా : **ఉపజాతివృత్తం**

కప్ప బెకబెకలకే భయపడతాడు
కాని ఓడిస్తానంటాడు 'వాఘలా' ని
అసలా ఆలోచనే తప్పనుకొంటే
మిథ్యాభిమాని మాత్రం చేస్తాడు తనకేం తోస్తే అదే

రంగలా : **ఉపజాతివృత్తం**

ఓడిపోయినా ఆటవదలడు
మిథ్యాభిమాని గర్వం విడువడు
క్రిందపడినా కాళ్ళు మాత్రం పైనే
ఉన్నాయి, లేదు ఓటమి నాకంటాడు.

కుతుబ్‌ఖాన్ స్వభావాన్ని విమర్శించినట్లే వాఘ్‌జీ అతని వివాహాన్ని గూర్చి ప్రశ్నిస్తాడు.

వాఘ్‌జీ : పెళ్ళి చేసుకున్నపుడు మీకు కొంతడబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుందా?

కుతుబ్‌ఖాన్ : आपके लोग में जातखाल देखते हैं, और पैसा लगता है, लेकिन हम लोगों

में मर्दक देखकर औरत उसने शादी करना चाहती है, उस कारण से पैसा नहीं लगता। (మీలో జాతి, కులం వగైరా చూసి పెళ్ళిళ్ళు చేసుకుంటారు. అందువల్ల మీలో పెళ్ళిళ్ళకి చాలా ఖర్చవుతుంది. మాలో మొగవాడి రూపురేఖలు చూసి ఆడది పెళ్ళి చేసుకుందామనుకుంటుంది. అందువల్ల మాలో పెళ్ళికి డబ్బులేం ఖర్చుకావు.)

వాఘ్‌జీ : మీ భార్య వయసెన్ని సంవత్సరాలుంటుంది?

కుతుబ్‌ఖాన్ : హ, హ, హ (నవ్వుతూ) बीबी की उम्र और रूप रंग सब हमारे बराबर है। (భార్య వయస్సు, మరియు రంగు, రూపము అన్నీ నాతో సమానమే)

హిందూ సమాజంలోని అగ్రవర్ణాలవారు కులీనత పేరుతో డబ్బుకోసం కన్యావిక్రయం చేయడం, వయస్సు తేడా చూడకుండా ముసలి వరులకు బాలికలనిచ్చి పెళ్ళి చేయడం వంటి దురాచారాన్ని అవహేళన చేయడం కోసం మాత్రమే దళ్‌పత్‌రామ్ ఈ ప్రస్తావన చేసాడు. ఇతర మతాలవారు, ఇతర కులాలవారు ఇటువంటి దురాచారానికి పాల్పడరని అగ్రవర్ణాల వారిని హెచ్చరించడమే ఆయన లక్ష్యం. ఈ ఉపనాటకం ఆద్యంతమూ హాస్యభరితంగానే ఉన్నా కుతుబ్‌ఖాన్ దాహం వేస్తోందన్నపుడు రంగలా "అక్కడ బట్టి ఒకటి మాత్రం పోస్తుంది, ఫో, వెళ్ళి తాగి రా" అనడం హాస్యధోరణిని అతిక్రమించి వెగటుగా వినిపిస్తుంది. అలాగే కుతుబ్‌ఖాన్ ఎంత పిరికివాడైనా బావిలో కప్పల అరుపులను విని "बावडी में जरूर दस बीस शेर हैं। (బావిలో నిశ్చయంగా పదో, ఇరవయ్యో పులులున్నాయి)" అనడం మరీ ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. కన్యాశుల్కంలోని హాస్యంలో ఈ వెగటుతనం గానీ, ఎబ్బెట్టుతనం గానీ కాగడా వేసి వెతికినా కనిపించవు. అందులోని హాస్యోక్తులన్నీ జీవితపు లోతులలోంచి బావిలోని జలలు పెల్లుబికినట్లు సహజంగా ఉబికి వస్తాయి.

గురజాడ సమకాలీన నాటక రంగం పోకడలన్నింటినీ ఆకళించుకున్న మేధావి. ప్రధాన నాటకంతో పాటు ఉపనాటకాన్ని ప్రదర్శించే ఈ సంప్రదాయాన్ని ఆయన గమనించకపోలేదు. కన్యాశుల్కం నాటకంలో కూడా ఒక ఉపనాటకానికి ఆయన స్థానం కల్పించాడు. అయితే ఇది మిథ్యాభిమాన్‌లోని కుతుబ్‌ఖాన్ ఉపనాటకం లాంటిది కాక మృచ్ఛకటికం నాటకంలోని ఆర్యక వృత్తాంతంలా ప్రధాన కథతో విడదీయరానిదిగా కలిసిపోయింది. ప్రధాన నాకంలోని పాత్రలే ఉపనాకటంలో కూడా పాత్రధారులయ్యారు. కరటకశాస్త్రి, అతని శిష్యుడు మహేశం ఈ ఉపనాటకంలో ప్రధానపాత్రధారులు. వీరిద్దరూ దీనికోసం వేషధారణ కూడా చేసారు. అగ్నిహోత్రావధాన్లు రెండవ కుమార్తె అయిన సుబ్బి పెళ్ళి తప్పించడం కోసం కరటకశాస్త్రి గుంటూరు శాస్త్రిగాను, మహేశం మాయగుంటగాను (సుబ్బి అనే పేరుతో ఆడవేషం వేసిన మహేశం) వేషధారణ చేసారు. క్రమంగా ఈ ఉపనాటకంలోకి మధురవాణి, రామప్పపంతులు, లుబ్ధావధాన్లు, సిద్ధాంతి, మీనాక్షి ఇటువంటివారు కూడా ప్రవేశించారు. ఆడవేషంలో ఉన్న మహేశం లుబ్ధావధాన్లను పెళ్ళి చేసుకొని వాళ్ళ యింటిలో అల్లరిచేసి చివరకు వారికి తెలియకుండా రాత్రి వేళ గోడ గెంతి పారిపోవడంతో పరమాద్భుతమైన హాస్యాన్ని సృష్టించిన ఈ ఉపనాటకం ముగిసిపోయింది. అయినా దాని ఫలితం మాత్రం ముగియలేదు. ప్రధాన నాటకాన్ని చివర వరకు ఈ ఉపనాటకమే నడిపింది.

(సశేషం)

# తెలివాహ గోదావరినది

## (సుమేరియన్ సంస్కృతికి తెలంగాణ మాతృభూమి)

- డా. సంగనభట్ల నరసయ్య

ఆంధ్రదేశపు ప్రాచీన చరిత్రలో 'తెలివాహ' నది ఎక్కడ ఉందో అస్పష్టంగా ఉన్న అంశం. శెరవనీయ బౌద్ధ జాతకగాథ ఈనదిని పేర్కొని దీని ఒడ్డునే ప్రసిద్ధమైన ఆంధ్రపురం గూర్చి చెప్పింది[1]. ఈ నది ఏది అనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ తెల్ నది మహానదికి ఉపనది అని, ఇది ఒరిస్సా ఆంధ్ర హద్దుల్లోనిదని పేర్కొన్నారు. కాని ఇది ఆంధ్రదేశపు నది కాదు. భౌగోళికంగా ఇది కుదరనిదని ఆచార్య గంటి జోగి సోమయాజిగారు తెలిపినారు[2]. రాయచౌధరిగారు దీన్ని కృష్ణానది అన్నారు. దీని ఒడ్డున పేర్కొబడ్డ ఆంధ్రనగరం ధాన్యకటకం అని నిర్ధారించారు. పల్లవరాజు శివస్కంధవర్మ క్రీ.శ. 234 నాటి తన మైదవోలు శాసనంలో ధాన్యకటక, 'ఆంధ్రపథ' పేర్లు పేర్కొన్నాడు[3]. ధాన్య కటకం క్రీ.శ. 1వ శతాబ్ది నాటికే అతి ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రం కావడం వల్ల బౌద్ధ జాతక కథలలో పేర్కొనబడి ఉండవచ్చునేది[4] వీరి భావన. శబ్ద వ్యుత్పత్తి (Etymology) ప్రకారం తేల్ శబ్దాన్ని తైల శబ్దం నుండి వచ్చిందని నూనెలా నల్లగా ఉండేనది కనుక కృష్ణానదికి ఆ పేరు కుదురుతుందని భావించారు.

కాని బౌద్ధ వాఙ్మయంలో పేర్కొబడ్డ ఈ 'తెలివాహ' నది గోదావరినది అని నా ప్రగాఢ విశ్వాసం. దీనికి ఉపబలకంగా కొన్ని ఆధారాలు ఇవ్వబడుతున్నాయి :

కృష్ణానదికి కణ్ణ బెణ్ణా అని పేరుండేదానాడు. కణ్ణ బెణ్ణ 'కృష్ణవేణి' శబ్ద తుల్యం. నల్లని ప్రవాహం అని అర్థం. ఈ పేరు బౌద్ధజాతకగాథల్లోనే గాకుండా నానేఘాట్ గుహలోని మొదటి శాతకర్ణి భార్య దేవినాగనీక క్రీ.పూ. 180లో వేయించిన శాసనంలో దీన్ని[5] పేర్కొనడం జరిగింది. క్రీ.పూ. 2శతాబ్దాకి ముందే కృష్ణానదికి ఈ పేరు స్థిరపడింది. తెలివాహ, కణ్ణబెణ్ణ అనేవి సమకాలిక నామాలు. అవి ఒకేనదికి ఏకకాలంలో ఉండవు. ఒకవేళ గౌతమి, గోదావరి వలె ఉన్నాయనుకున్నా అర్వాచీనంగా పురాణగాథలాధారంగా ఇవి ఏర్పడ్డవి. పురాణాల ప్రకల్పన నాటికి లేదు. నల్లని నది, తెల్లని నది అని రంగును బట్టి ఏర్పడ్డ ప్రాచీన నామాలు. కృష్ణ అంటేనే నల్లనిది, తెలి అంటే తెల్లనిది. తెలివాహ అంటే తెల్లని ప్రవాహం కలదని అర్థం వాహ, ప్రవాహ ఉపసర్గ 'ప్ర' కల్గిన ఏకపదమే. తెలి అంటేనే తేట, తెళుగన్నడ అంటే తేట ఐన కన్నడ భాష, తెళి+ అగు= స్వచ్ఛమైనది. తెళ్ > తెల్ > తెలి అనే పరిణామ క్రమంలో మూలద్రావిడంలో 'స్పష్టమైన, ప్రకాశమానమైన' అనే అర్థాలు కలిగి ఉన్నాయి. ఇది ప్రాచీన పదం అనడానికి గుర్తుగా దీని మీద 'పు' అనే తద్ధిత ప్రత్యయం చేరి తెలుపు ఇత్యాది శబ్దం సిద్ధం కావడమే. (నలుపు, ఎరుపు, పసుపు) ఈ నామాలు విశేషణాలుగామారినపుడు 'పు' ప్రత్యయం తొలగి పదాంత హల్లు ద్విత్వమై నల్ల, తెల్ల, ఎర్ర, పచ్చ అనే ఒకేవర్గ పదాలుగా స్థిరపడ్డాయి.

గోదావరికి తెలివాహ, కృష్ణకు కణ్ణబెణ్ణ (బెణ్ణ=వేణి=పాయ) అని పేర్లు బౌద్ధవాఙ్మయంలో వ్యవహార నామంగా కనబడటానికి కారణం ఈ రెండు నదుల మధ్య ప్రాంతాలు లేదా సమీపవర్తి ప్రాంతాలు బౌద్ధ

---

డా. సంగనభట్ల నరసయ్య, ప్రిన్సిపాల్, శ్రీలక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల, ధర్మపురి.

పుణ్య క్షేత్రాలు కావటమే. ఐతే విశేషంగా గోదావరి నదీ దక్షిణ తీరం బౌద్ధుల ప్రాచీన పర్యాటక క్షేత్రం. తెలివాహ నది ఒడ్డున (ప్రాచీన) ఆంధ్రనగరం ఉందని బౌద్ధ వాఙ్మయం చెప్పడం వల్ల తమ కానాటికి తెలిసిన ధాన్యకటకంకు ముడివేసి తెలి శబ్దంకు కృష్ణానదికి ముడిపడక తైల శబ్దం తీసికొని, నూనె నల్లగా ఉంటుందని కృష్ణానది నూనెలాగ ఉందని ఊహ చేసారు. (తెలిలోని ఎ (హ్రస్వ వక్రం) సంస్కృత వర్ణమాలలో లేదు కనుక ఈ శబ్దం సంస్కృతం కాదు. తైలంతో సంబంధం లేదు), కాని గోదావరి నది తీరాన ధాన్యకటకానికి 300 సం॥ ముందే ఉన్నమరో మహానగరం గూర్చి ఆనాడు ఎవరికీ తెలియదు. అది కరీంనగర్ జిల్లాలోని (ధర్మపురికి 15 కి.మీ. దూరంలో - వెల్లటూరు మండలంలోని) కోటిలింగాల గ్రామం, గోదావరి తీరానగల 2500 సం॥ క్రిందటి గ్రామం.

తెలివాహ ఒడ్డున గల నగరం ధాన్యకాటకమేమోనని చరిత్రకారులు ఊహించే నాటికి 'కోటిలింగాల'లో తవ్వకాలు జరుగలేదు. ఇది క్రీ.శ. 1979-84 మధ్య పురావస్తు శాఖ, ఆం.ప్ర. ప్రభుత్వం వారు తవ్వకాలు జరుపగా అనేక విశేషాలు వెలుగు జూసాయి. దీంట్లో 'గర్భ నగరం' బయట పడింది. ఇది శాతవాహనుల తొలి రాజధాని. తొలిరాజు శ్రీముఖుని పేరు శాసనాల్లో మాత్రం కనబడి అతని ఆధారాలు లభించని స్థితిలో ఉండగా ఇక్కడ అతని వందలాది నాణెములు 'సిముక' పేరుతో లభించాయి. పేరు తెలియని మరొక శాతవాహన రాజు నాణెములు, అంతకు ముందే పరిపాలించిన సామగోపుని నాణెములు, మహాతలవర, మహాసేనాపతిస అనే పేర్లుగల నాణెములు లభించాయి. క్రీ.పూర్వమే ఈ నగరానికి విదేశీ వ్యాపారులతో సంబంధాలకు గుర్తుగా రోమన్‌సామ్రాట్టుల నాణెములు లభించాయి. ఆనాటి నగర విశేషాలు, బావులు, కాలువలు, పారిశుద్ధ్యపు జాగ్రత్తలుగల ఇటుకల నిర్మాణాలు బయట పడ్డాయి. ఈ కోటిలింగాల నగరంలో ఆగ్నేయభాగంలో పెదవాగు గోదావరిలో సంగమించేచోట బౌద్ధ స్తూపం కానవచ్చింది. ఇక్కడ క్రీ.పూ. 3 శతాబ్దులకు ముందే నిర్మితమైన కోట శిథిలాలు కానవచ్చాయి. కోట నిర్మాణానికి, స్థూప నిర్మాణానికి ఒకే ప్రమాణపు పెద్ద పెద్ద ఇటుకలు వాడినారు. ఇది ధాన్యకటక(అమరావతి) బౌద్ధస్థూపానికి, నగరానికి ముందుటి నిర్మాణాలు. ఇది శాతవాహనులకు పూర్వపు నగరం. ఈ స్థూపానికి చెందిన రాతి ఫలకాల మీద గల లఘు శాసనాల రాతలను బట్టి ఇది మౌర్యుల కాలానికి ముందుదని, దీని మీద రాతల్లోగల లిపి బ్రాహ్మీలిపి కంటె ప్రాచీనమైందని ఠాకూర్ రాజారాం సింగ్‌గారు అభిప్రాయపడ్డారు. యావద్భారత దేశంలోనే అశోకుని బ్రాహ్మీలిపి శాసనాలు తొలినాళ్లవి కాగా ఇవి మరీ ప్రాచీనాలౌతాయి. నేడు కోటిలింగాలగ్రామం (కోట కారణంగా) కోటలింగాలగా వ్యవహరించబడేదని చెపుతారు. ఈ నగరం చుట్టూరా విస్తరించిన రాజ్యం ఆంధ్రదేశంలో చరిత్ర కందునంత పూర్వపుదిగా వెలుగులోకి వచ్చింది. అర్ధసహస్రాబ్ది ఆంధ్రదేశాన్నేలిన రాజవంశమైన శాతవాహనులకు తొలిరాజధాని (క్రీ.పూ. 3వశ.) కోటిలింగాల, మలిరాజధాని ప్రతిష్ఠానం (పైఠాన్ = మహారాష్ట్రలోని ఔరంగాబాద్ సమీపగ్రామం, ఆ పిదప మూడవది ధాన్యకటకం (అమరావతి)గా భావించవచ్చు. తొలిమలి రాజధానులు గోదావరితీర నగరాలు. తృతీయం కృష్ణాతీరం.

క్రీ.పూ. 300 సం॥ ప్రాంతంలో మగధ రాజైన చంద్రగుప్త మౌర్యుని ఆస్థానాన్ని సందర్శించిన గ్రీకు రాయబారి మెగస్థనీసు తన గ్రంథంలో 30దుర్గాలు, లక్ష కాల్బలం, రెండువేల ఆశ్వికదళం,

వేయి ఏనుగులు కల చతురంగ బలాలు కల్గిన ఆంధ్రులు మౌర్యుల తర్వాత అతి పెద్ద రాజ్యం కల్గి ఉన్నారని చెప్పింది ఈ ప్రాంతం గురించేనని భావించవచ్చు[7]. నాడు ఆంధ్ర దేశాన ఇంత ప్రాచీనమైన రాజ్యం లేదా రాజధాని నగరం నదీ తీరాన బయటపడలేదు. క్రీ.పూ. 3వ శ.లో అశోకుడు వేయించిన 13వ ధర్మలిపి శాసనంలో ఆంధ్రులు బుద్ధుని ధర్మబోధనలను అనుసరించారని ''నిచచోడ... ఆంధ్ర పులిదేషు సవత్ర దేవనం పియస ధమనుశస్తి'' అని రాసింది ఈ ప్రాంతం గురించే. కారణం ఇక్కడ అంటే కరీంనగర్ జిల్లాలో గోదావరికి దక్షిణంగా నేటికి కోటిలింగాల, పాశాయిగాం, ధూళికట్ట, పెద్దబొంకూరు మొ॥ ప్రాంతాల్లో అనేక బౌద్ధ స్థూపాలు సాక్ష్యంగా నిలిచి ఉన్నాయి. ధూళికట్టలో మరొక మట్టికోట ఆనవాళ్లు బయట పడ్డాయి. ఇవి మెగస్తనీసు చెప్పిన దుర్గాలు. క్రీ.శ. 2వ శతాబ్ది నాటి ప్లినీ (గ్రీకు చరిత్రకారుడు) కోసల దేశాన 'అంధర' రాజ్యం ఉన్నట్లు వారికి సంబంధించినపై వివరాలే ఇచ్చాడు. దుర్గాలు మాత్రం 80 అని చెప్పినాడు. కోసలరాజ్యానికి దక్షిణంగా ఉన్న ఈ రాజ్యం గోదావరి ఉభయ పార్శ్వాలైన బస్తరు, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలుగా గుర్తించవచ్చు. ఈ ప్రాంతాన్ని పి.వి. పరబ్రహ్మశాస్త్రిగారు దక్షిణ కోసలగా తెలిపినారు. కోటిలింగాల నగరం దక్షిణకోసలకు నడిబొడ్డునగల రాజధాని నగరం. ఇదే తెలివాహ ఒడ్డునగల నాటి ఆంధ్రనగరం.

పాళీ బౌద్ధ వాఙ్మయంలో పేర్కొబడ్డ అంధకరట్టి (ఆంధ్రరాష్ట్రం) తెలుగు ప్రాంతమని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు చెప్పారు. అది ఈ ప్రాంతమే. ఎందుకంటే బౌద్ధవాఙ్మయంలో పేర్కొబడ్డ అస్సక, ముల్లకులు కూడా ఈ సమీప ప్రాంతాలవారే. అశ్మక (అస్సక) నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రాంతాలు. మూలక (ముల్లక) పైఠాన్ ప్రాంతం నుండి దక్షిణ మహారాష్ట్ర గోదావరి తీర ప్రాంతాలు. ఇవి అత్యంత ప్రాచీనమైన క్రీ.పూ. 600 నాటి జనపద ప్రాంతాలు[8]. ఇవి తర్వాత శాతవాహనులు రాజ్య నిర్మాణం చేసి, కోటిలింగాలను తత్పూర్వ రాజన్యులనుండిగెలిచి, తొలిరాజధానిగా చేసికొని పాలించిన ప్రాంతాలు. శాతవాహనులు క్రీ.పూ. 3వ శ. లో రాజ్య నిర్మాణం కావించారు. బుద్ధునికి సమకాలికుడైన బావరి అనే బ్రాహ్మణుడు (క్రీ.పూ.600) తన శిష్యులతో అశ్మకరాజ్యంలో గోదావరి తీరంలో నివసించాడని బౌద్ధవాఙ్మయంలో ఉంది[9]. ఈయన నివసించిన ప్రాంతం కరీంనగర్ జిల్లాలోని గోదావరి ప్రవాహ మధ్యస్థ ద్వీపం బాదనకుర్తి (బావరికుర్తి)గా ఠాకూర్ రాజారాంసింగ్‌గారిచేగుర్తించబడింది[10]. కోటిలింగాల నగరానికి 4 కి.మీ. దూరంలోగల పాశాయిగాం గ్రామం వెలుపల రోడ్డు మీద బౌద్ధ స్థూపం ఉంది. బౌద్ధాచార్యుడై దిగంతాల విఖ్యాతుడైన ఆచార్య దిఙ్నాగుడు ఈ గ్రామం వాడేనని కృష్ణశాస్త్రిగారు తెలిపారు.

ప్రాకృతంలో రాయబడ్డగాథా సప్తశతివల్ల అత్యంత సుప్రసిద్ధుడైన హాల శాతవాహన చక్రవర్తి సింహళ రాజకన్య లీలావతిని వివాహమాడిన గాథ 'లీలావతీ' అనే పేరుగల కావ్యంగా కుతూహలుడనే కవి రాసినాడు. రాచ వివాహం సప్తగోదావరి తీర్థస్థ భీమేశ్వరుని సన్నిధిలో జరిగింది. (సప్తగోదావరి భీమేశ్వరు డనగానే దాక్షారామం వైపుకు మనసు పరుగెత్తుతుంది. కాని దాక్షారామంలో గోదావరి నదిలేదు). గోదావరి కరీంనగర్ జిల్లాలో మల్లాపూర్ మండలంలోని వేంపల్లి వెంకటరావు పేట వద్ద ఏడుపాయలుగా చీలింది. కోటిలింగాల రాజధానికి ఇది 70కి.మీ. దూరం. ఇక్కడ తీరాన శాతవాహనుల కాలపు ప్రాచీనాలయం

ఆకాలపు ఇటుకలతో నిర్మాణం ఐంది గోదావరి ఒడ్డున చూసాను. ఇక్కడ ఏనుగలతో ఉల్లిగడ్డలు మోయించి తెచ్చి వ్యాపారం చేసేవారని అంత పెద్ద సంత జరుగుతుండేదని చెప్పారు. ఇక్కడ నాకు గోదావరి తీరాన ఇనుప ఖనిజంగల బిళ్లలు గోదావరి వరదకోతకు గురైన తీరాన లభించాయి. ఈ నదీ తీరాలన్నీ వ్యాపారకేంద్రాలే. హాలుని కాలానికి ఇది ఆయన రాజ్యంలో ప్రసిద్ధ ప్రాంతం. దీన్ని బట్టి హాలుడు శాతవాహన సామ్రాజ్యం కోటిలింగాల రాజధానిగా క్రీ.శ. 1వ శతాబ్దిలో ఏలి ఉండేవాడని గాథాసప్తశతి కరీంనగర్ జిల్లాలో పుట్టిందని భావించవచ్చు[11]. గాథాసప్తశతిలోని తెలుగు పదాలు తిరుమల రామచంద్రగారు ఎత్తిచూపినవి ఈ ప్రాంతంపు తెలుగు భాష యొక్క నాటి వాడుకలోనివే.

ఈ తెలివాహ నది గోదావరే కావడం వల్ల తెలుగునాట గోదావరి తీర ప్రాంతాలైన అశ్మక, మూలక రాజ్యాలు అత్యంత ప్రాచీన జనపదాలు కావడం వల్ల తెలుగు భాషా సంస్కృతులు ఇక్కడే వికసించాయన వచ్చు. ఈ ప్రాంతం నుండే ఇతర ఆంధ్రదేశ ప్రాంతాలకు వలస వెళ్లిన తెలుగువారు తెలుగుభాషను ఈ ప్రాంతాలలోని తమ గ్రామాల పేర్లను యావదాంధ్ర దేశంలో వ్యాప్తం చేసారనవచ్చు. తెలంగాణలోని ప్రాచీన గ్రామ నామాలు ఇతర ప్రాంతాల్లో కూడా కనబడుతున్నాయి[12]. ప్రముఖ ఎటిమలొజిస్టు ప్రా. యార్లగడ్డ బాలగంగాధరరావుగారు తెలంగాణలోనే తెలుగు పుట్టిందని, అది తరువాత ఇతర ప్రాంతాలకు విస్తరించిందని తెలిపినారు[13]. అంతేకాదు ఈ ప్రాంతాల్లో బౌద్ధం వ్యాప్తం ఐన కారణంగా ప్రచారంలో ఉన్న పాళీభాష నిజానికి ప్రాకృతభేదం కాదని ఇది తొలినాళ్ల తెలుగేనని ఓ అభిప్రాయం ఉంది. పాళీ భాష క్రీ.పూ. 3వ శ.లో సింహళ దేశంలోని మాగధీ ప్రాకృతమేనని జాన్ బీమ్స్ అభిప్రాయం. ఈ అభిప్రాయాల్లో నిశ్చితి లేదు. గుణాఢ్యుడు (1వ శతాబ్ది) తాను శాతవాహనరాజు కొలువులో పందెంలో ఓడిపోయిన కారణంగా త్యజించిన రచనానుకూల భాషల్లో సంస్కృత ప్రాకృతాలతో బాటు దేశ్యభాష కూడా ఉంది. ఇది తెలుగేనని పండితాభిప్రాయం. ఈ శాతవాహన రాజు కోటిలింగాలలో ఉన్నాడా? ప్రతిష్ఠానపురంలో ఉన్నాడా? అనేది సందేహమే. ఐనా 1వ శ. నాటికి కూడా కోటిలింగాల రాజధాని కావడం వల్ల ఈ చారిత్రక సంఘటన ఇక్కడే జరింగిందని భావించవచ్చు. పైఠాన్ ఐతే అక్కడి దేశ భాష మహారాష్ట్రి ప్రాకృతం అవుతుంది. సంస్కృత ప్రాకృతాలు కాక మరొకటి కదా ఆయన త్యజించింది? అపుడాయన త్యజించింది దేశ్యభాష ఐన తెలుగే. పైఠాన్ (ప్రతిష్ఠాన్), కోటిలింగాల నగరాలు తెలివాహ తీరంలో ఉన్నవే.

తెలివాహ నది ఒడ్డున పుట్టినదే తెలుగు భాష. ఈ భాషకు ఈ పేరు రావటానికి రకరకాల వ్యుత్పత్తులు చెప్పారే కాని 'తెలి' నది వల్ల వచ్చి నట్టు ఎవరూ చెప్పలేదు. తేల్ + అగు అని తెలుగులో నది వ్యుత్పత్తి చెప్పినా అది (తేల్‌నది) తెలుగు నాటలేదని సోమయాజీగారు ఖండించారు[14]. తెళి + అగు = తెలుగు = స్వచ్ఛమైనది అని భాషాపరంగా మరో నిర్వచనం. తెళ్ > తెల్ > తెలి అని స్పష్టమైన ప్రకాశమానమైన భాషగా పేరు అని మరో నిర్వచనం. తిలలవలె గోవులుండే దేశమని మరో నిర్వచనం. తెలుగు శబ్దం తెనుగు శబ్దం నుండి పుట్టిందని తెనుగు త్రినగ శబ్ద భవమని, తేనె + అగు = తెనుగు అని మరికొన్ని నిర్వచనాలు[15]. తెలుగు శబ్దం త్రిలింగ శబ్ద భవమని, త్రికళింగ శబ్ద భవమని రకరకాల నిర్వచనాలు వచ్చాయి[16]. బర్మాదేశంలోని తైలంగుల జాతివారే తెలుగువారని కూడా జాతిపరంగా చెప్పినారు[17].

అయితే ఇవి ఖండనీయాలే. తేల్‌నది ఒరిస్సాలోనిది. ఎవరి భాష వారికి స్వచ్ఛమైనదే. మూలవలె గోవులుండటం పండితోత్ప్రేక్ష[18]. మూడు పర్వతాల మధ్య తెలుగునేల మొత్తం లేదు. మూడు లింగాల (శివ క్షాత్రాల) మధ్య భూభాగపు భౌగోళిక హద్దులు అర్వాచీనాలు. తెన్+ అగు= దక్షిణ దేశపు భాష అని దిగర్థంలో చెప్పినా ఔత్తరాహికులకు తెలుగునేల దక్షిణం అవుతుందేతప్ప ద్రావిడ ప్రజలకు ఈ దిశ కుదురుట లేదు.

తెలివాహ నదీ తీరపు భాష తెలుగే అని చెప్పడం వల్ల దీని ప్రాచీనత్వం స్థిరపడుతుంది. ఈ నది తీర భూమి తెలంగాణ. ప్రాచీన తెలుగు నేల. గోదావరి మూడింట రెండు వంతులు తెలంగాణలోనే పారుతుంది. గోదానదికి శబరి కలిసి గోదా+ శబరి=గోదావరి ఐ శబరి సంగమం తర్వాతి నేలపై పారినపుడు కింది తీరాల్లో ఈ పేరు అర్వచీనంగా స్థిరపడి ఉండవచ్చు. తెలివాహతో తడిసే విస్తృత భాగం తెలంగాణ. ప్రారంభంలో దక్షిణ గోదావరి పరీవాహక ప్రాంతాలైన కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో వికసించిన తెలుగు తెలివాహ నామోద్భవం ఐ తరువాత విస్తృతమైంది. మంజీరికా దేశమని బౌద్ధ వాఙ్మయంలో పేరుగల మెతుకు సీమ ప్రాంతం గోదావరి ఉపనది ఐన మంజీర వల్ల ఏర్పడింది. ఇది తెలంగాణమే ఐనా ఆనంతరిక విస్తృత తెలంగాణ. దీన్ని బట్టి ప్రాచీనంగా ఈ ప్రాంతాలు నదుల పేర్లతో పిలువబడేవని, తెలంగాణ తెలివాహనది ఒడ్డున ఉండటం వల్లే ఈ పేరు వచ్చిందని భావించవచ్చు. (తెలివాహ నదితో తడిసిన అతి ప్రాచీనమైన ప్రాంతం మాత్రం నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలే. అశ్మక, మూలక జన పదాలుగల క్రీ.పూ. 600 నాటి భౌగోళికస్థితి). తెలంగాణ పద వ్యుత్పత్తిని కొంచెం పరిశీలించాలి. తెలి అనేది నదీ సంబంధంగా నిర్ధారణమైంది. మిగిలిన 'గాణ' అనేది ప్రాంతం, భూమి అనే అర్థంలో ఉంది. తెలుగులో మా'గాణ' అనే పదంలో నదీ జలాలతో తడిసి పంటలు పండే భూమి అనే అర్థంతో కనబడుతుంది. మెట్ట అంటే ఎత్తైన పొడినేల, మాగాణ అంటే జలసిక్త సస్యక్షేత్రం. కాణాచి అనే మరోదేశ్య పదం స్థావరం, ప్రాంతం అనే అర్థంలో ఉంది. తెలంగాణ అంటే తెలి ప్రవాహసిక్త భూమి అని ఈ ప్రాంతానికి స్థిరపడింది. గోదావరి నదికి ఉత్తర భూములైన అదిలాబాద్, బస్తరు జిల్లాలు జనావాసాలున్నా భీకరారణ్యాలే. జనపదాలు, నగరాలు, రాజ్యాలు రెండున్నర వేలసం॥ క్రితం గోదావరి దక్షిణ ప్రాంతాల్లో ఉన్నట్టుగా అక్కడలేవు. పైగా ఉత్తర భారతదేశంలోని సంచార జీవనులు, బౌద్ధయాత్రికులు మొ॥వారు నదిదాటిన తర్వాతే తెలిభాష మాట్లాడే సీమలో అడుగుపెట్టేవారు. భాషల మాండలికత్వానికి నదులే హద్దులు. తెలింగాణ > తెలంగాణ ఐంది. తెలినది గమించే భూమి, తజ్జనులు, తద్భాష తెలుగు ఐంది. క్రీ.శ. 102లో గ్రీకు భౌగోళికుడు టాలెమీ చెప్పిన టెలింగానే ఈ తెలంగాణమే. తెలుగులో ల-నామారి తెనుగూ మరో పేరు స్థిరపడి ఉంటుంది[19]. ఈ విధంగా తెలివాహ గోదావరి నదిగా నిర్ధారించవచ్చు.

★ ★ ★

(ఈవ్యాసానికి రెండో భాగంగా సుమేరియన్ సంస్కృతికి జనకులైన తెలిమన్‌లు తెలినది తీరవాసులైన తెలంగాణ ప్రాంతీయులేనని నిర్ధారిస్తూ ఈ క్రింది అంశాలు వివరిస్తాను.)

మెసపొటేమియా (నేటి ఇరాన్, ఇరాక్ దేశ ప్రాంతాల) లో సుమేరియన్లు క్రీ.పూ. 2000 సం॥ క్రితం నివసించేవారు. నేటికి నాలుగు వేల సంవత్సరాల క్రితం మాట. వీరి సంస్కృతిని The lost culture (నశించి పోయిన సంస్కృతి)గా చరిత్రకారులు భావించారు. వీరి రాతలు Clay Tablets (మట్టి బిళ్లల) మీద లభించిన వాటి ప్రకారం తాము సూర్యుడు ఉదయించే దిక్కు నుండి వచ్చామని, తమ దేశం (వలస వచ్చిన వారి మూల ప్రాంతం) ప్యారడైజ్ ల్యాండ్ (స్వర్గసీమ) ఐన 'తెలిమన్' దేశం (Telmun) తమ దేవుడు ఎంకి అని జియశూద్ర (Ziasudra) తమ మూల పురుషుడని చెప్పుకున్నారని చరిత్రకారులు రాసారు[20]. హమ్మురాబి రాజు క్రీ.పూ. 1792-1750ల మధ్య బాబిలోన్‌ను పరిపాలించాడు. ఈయన కాలంలో ఈ సుమేరియన్‌ల రాజ్యం బాగా విస్తరించింది[21]. అస్సిరియన్ రాజ్యం క్రీ.పూ. 7వ శతాబ్దిలో శిథిలం కాగా రాజభవనాలు ఆర్కియాలజి తవ్వకాలలో బయట పడిన వీరి రాజధాని నగరం ఐన నినేవే (Nineveh) లో అస్సురబానిపాల్ చక్రవర్తి గారి 25వేల పుస్తకాల లైబ్రరీ బయటపడింది. ఈ లైబ్రరీలోని పుస్తకాలన్నీ Clay Tablets. ఇవి కీల లిపి (Cuneiform Script)లో ఉన్నాయి.

ఈ సుమేరియన్లు తమ తెలిమన్ ల్యాండ్ నుంచి వెళ్లి సుమేర్‌లో స్థిరపడ్డా తమ పూర్వీకులతో సంబంధ బాంధవ్యాలు, వ్యాపారాలు కల్గి ఉన్నారు. తెలిమన్ (పూర్వజుల దేశం), సుమేర్ (స్థిరపడ్డ దేశం)ల మధ్య వర్తక ఆర్థిక సంబంధాలవల్ల తెలిసిన వివరాల ప్రకారం తెలిమన్‌లు తెలుగు వారు. తెలిమన్ ప్రాంతం తెలుగు ప్రాంతం. మట్టి బిళ్లల మీద ద్రావిడం, ద్రావిడం నుండి విడిపోతున్న దశలోని తెలుగు భాష ఉంది. దాంట్లో తెలుగు పదాలు, వాటి ప్రాచీన రూపాలు ఉన్నాయి.

ఈ తెలిమన్ ప్రాంతం తెలివాహ (గోదావరి) నది తీరమైన తెలుగునేల. అంటే తెలంగాణనేల. తెలిమన్ తెలుగు పదాల (తెలి=తెల్ల, మన్=మన్ను) మూలరూపం కాదుగదా! సుమేరు ప్రాంతం పేరులో పర్వతనామం, అస్సుర బానిపాల్ (అసుర వనపాలుడు) లలో మరికొంత సంస్కృతం వినిపిస్తోంది. సుమేరియన్లు వాడిన మట్టి బిళ్లలమీద క్యూనిఫాం లిపి (కీలలిపి) భారతదేశపు బ్రాహ్మీలిపికి మాతృక అని లిపి శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. కోటిలింగాల తవ్వకాలలో బౌద్ధ స్థూపపు లఘు శాసనాలలో పూర్వ బ్రాహ్మీ లిపి కొంత గోచరించింది. ఎడ్వర్డ్ థామస్ సంస్కృత ప్రాకృత భాషలకు ఉపయోగించిన అక్షరాలకు అశోకుని శిలాశాసనాల్లో ఉపయోగించిన (బ్రహ్మీలిపి) అక్షరాలకు మూలం ద్రావిడ లిపేనని భావించాడు.[22]

భారతదేశం - మెసపొటేమియాల మధ్య వ్యాపార సంబంధాలు క్రీ.పూ. 3వ సహస్రాబ్ది నుంచి ఉన్నాయని ప్రొ. జేమ్స్ ఎడ్గార్ స్విన్ అన్నారు. మెసపొటేమియాలోని సుమేరియన్ సంస్కృతిని పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చారు[23]. కాని భారతదేశంలో ఏ ప్రాంతమో తెలుప లేదు. అవి గోదావరి దక్షిణ తీరస్థమైన ప్రాంతాలే.

సుమేరియన్ల కాలగణన మనవారితో కలుస్తుంది. తెలుగువారి వలెనే వారు చాంద్రమానంతో కాలాన్ని కొలిచేవారు. 60 సం॥లు వారికి కాలప్రమాణం, ఆర్యులవలె శతమానం లేదు. ఆయా సంవత్సరాల శుభా-శుభాలు, తుఫాన్లు, యుద్ధాలు, ముఖ్యమైన వ్యక్తుల మరణాలతో పేర్లు పెట్టే వారు[24]. మనకు

60 సం॥కు అదేవిధంగా సంవత్సర చక్రం పూర్తి అవుతుంది. ప్రభవ, ప్రమాది, బహుధాన్య, రాక్షస, నల, రౌద్రి, దుర్ముఖివంటి పేర్లుండటం గమనించాలి.

సుమేరియన్లు తెలుగునేల (తెలంగాణ ప్రాంతం) నుండి వలస వెళ్లినవారే అనడానికి ప్రాచీన శిలా సమాధులు సాక్ష్యం. ఇరాక్‌లోని కిర్కూక్ పట్టణంలోని సమాధులు మెదక్ (మంజీరకా దేశంగా బౌద్ధ వాఙ్మయం పేర్కొన్న ప్రాంతం) లోని మర్కూక్ ప్రాంతంలో పురావస్తు శాఖవారు జరిపిన తవ్వకాలలో బయటపడ్డ సమాధులు (మెగాలిథిక్‌లు) ఒకే జాతీయులు ఏర్పాటు చేసికొన్న సమాధులే.[25]

తడిమట్టి పెంకులమీద రెల్లుగడ్డివంటి సాధనంతో కీలాకారపు గుర్తులతో, నిశితమైన సాధనంతో గుంతలు తవ్వినట్లుగా సుమారు వేయి చిహ్నాలు ఉపయోగిస్తూ, ఒక చిహ్నం ఒక మారు అక్షరాన్ని, మరొకమారు పదాన్ని సంకేతించేలా రాసి, విషయం మారినపుడు (Para change లాగా) అడ్డు నిలువు గీతలతో విభజిస్తూ రాతపూర్తి చేశాక అగ్నిలో కాల్చి Clay Tablets తయారు చేసేవారు[26]. ఈ లిపి భారతదేశపు లిపులన్నిటికి మాతృక ఐన బ్రాహ్మీలిపికి మాతృక ఐంది. దీంతో పాశ్చాత్య చరిత్ర కారులు భారతదేశంతో వీరి సంబంధాన్ని స్థిరపరిచారు. వీరు తెలిమన్ దేశము వారు కనుక తెలివాహ నదీ ప్రాంత జనులతో మాతృ సంబంధం కల్గి ఉన్నవారు కనుక తెలివాహ ప్రాంతీయులైన తెలుగువారితో సంబంధం కల్గి ఉన్నట్లు నిర్ధారించవచ్చు. ఈ ప్రాంతంనుండే ఈ క్యూనిఫాంలిపి, ఇతర భారతీయ ప్రాంతాలకు వెళ్లింది. తెలుగువారు రాసిన లేఖలు Clay Tablets తెలుగుభాషతో ఈ జాతీయుల వద్దలభించాయి. తమ తెలిమన్‌ల్యాండ్‌స్వర్గసీమగా వర్ణించుకొన్న ప్రాంతం తెలివాహనదీ తీరంలోని తెలంగాణ ప్రాంతం. కోటిలింగాల పూర్వ బ్రాహ్మీలిపి శాసనాలు, అక్కడ లభించిన రోమన్ నాణెములు ఈ ప్రాంత ప్రాచీన సంబంధాలను నిర్ధరిస్తున్నాయి.

కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాల, వేంపల్లి వెంకటరావుపేట, ధర్మపురి (శాతవాహనుల నాణెములు లభించిన మరో గోదావరి తీరప్రాంతం), బాదన్‌కుర్తి వంటి గోదావరి తీరాలు నాడు విదేశీ వ్యాపారానికి అనువైనవి. చిన్న పడవలలో గోదావరి ద్వారా బంగాళ ఖాతంలో చొరబడి పాండిచ్చేరి (రోమన్‌నాణేలు దొరికిన చోటు) మీదుగా, సింహళం మీదుగా అరేబియా సముద్రంలోని భరుకచ్ఛ (టాలెమీ చెప్పినవి), కళ్యాణి, సాపోరా (సూరత్) (పెరిప్లస్ చెప్పిన తీరమిది) రాజస్థాన్ తీరాల వెంబడి, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌ల దక్షిణ భాగానగల సముద్ర జలసంధి గుండా పర్షియన్ గల్ఫ్‌లోకి చొరబడి 'ఊరు' అనే పేరుగల ఊరు చేరేవారు. ఈ ఊర్ (UR) బాబిలోన్‌కు పొరుగు నగరం. మరొక నగరం పేరు నిప్పూరు (Nippur) < నిప్పు + ఊరు = అగ్నినగరం, ఈ పేర్లు తెలుగు నామాలు[27]. నిప్పూరు క్రీ.పూ. 1500 సం॥ నాటినగరం. సింహళంతో నౌకా సంబంధాలు హేలుని రాణి సింహళ కన్య లీలావతి కళ్యాణానికి బాటలు వేసాయి. వీరిద్దరి వివాహం సప్తగోదావరి తీరం వెంపల్లి వెంకటరావుపేట (కరీంనగర్ జిల్లా)లో జరిగింది. క్రీ.పూ. 3000సం॥ క్రితం ఇక్కడి జాతీయులకు సోదరులుగా ఇరాన్, ఇరాక్ ప్రాంతాలకు, రోమ్ నగర ప్రాంతాలకు, అస్సీరియా ప్రాంతాలకు వెళ్లి స్థిరపడి, సుమేర ప్రాంతీయులుగా పేరువడి, తమ పూర్వీకులైన తెలుగువారితో సంబంధాలు, వ్యాపార లావాదేవీలు కొనసాగించారు. సోదర జాతీయులు కనుక అంత దూరం వ్యాపారం చేయగలిగారు.

క్రీ.పూ. 2000 నాటి ఈ Clay Tablets మీద ద్రావిడ భాష లేదా ద్రావిడ మాండలికంగా తెలుగుభాష (అప్పటికింకా ద్రవస్థితిలోనే ఉండి ఉంటుంది) విడివడి, ప్రత్యేక భాషగా మార్పు చెందడాన్కి మరో సహస్రాబ్దులు పట్టి ఉండవచ్చు. అంతేకాదు, తెలుగువలెనే ద్రావిడ భాషాజనితమైన మరొక భాష 'బ్రాహుఇ' (ఉత్తర ద్రావిడభాషగా) ఈ ప్రాంతాల్లో నేటికీ ఉంది. వాయవ్య భారతంలోని ఇండోయూరోపియన్ భాషా సముద్రంలో ద్రవిడ ద్వీపంలా ఈ 'బ్రాహుఇ' భాష ఉంది. ద్రవిడ జాతీయులు తెలిమన్ నుండి సముద్ర మార్గంగుండా పోయి స్థిరపడినారనుటకు నేటికీ ఈ భాషీయులు సజీవ సాక్షులు. పాకిస్థాన్‌లో కాలత్, ఖైర్‌పూర్, క్వెట్టా, హైదరాబాద్, కరాచీ ప్రాంతాల్లోను, పాకిస్థాన్ సరిహద్దుల్లోని ఆఫ్ఘనిస్థాన్‌లోను, ఇరాన్ దేశంలో కొన్ని జాతులు ఈ భాషను మాట్లాడుతున్నాయి. ద్రావిడ భాషలన్నీ దక్షిణ భారతదేశంలో ఉండగా ఈ ఒక్క 'బ్రాహు ఇ' మాత్రం వాయవ్య భారతం దాటి పర్షియా దేశాల్లో స్థిరపడటం భాషా శాస్త్రవేత్తలకు నేటి వరకు వింత. దీనికి కారణాలు ఇంతవరకు ఎవరూ చెప్పలేక పోయ్యారు. ఇలా ఒంటరిగా ఇండో యూరోపియన్ భాషా కుటుంబాల మధ్య విదేశాల్లో మిగిలిపోయిన ద్రావిడ భాషా జన్యమైన ఈ ''బ్రాహుఇ'' (Brahui) తెలివాహనదీ తీరాల నుండి తెలిమన్ల చేత తీసుకపోబడినది. అంతేకాదు ఈ భాష మిగతా ద్రావిడ భాషలకంటె తెలుగుకు అతి దగ్గరగా ఉన్న భాష.

సుమేర్ నుండి రాగిని దిగుమతి తెచ్చుకొని, తనకు మోసం జరుగగా, తెలిమన్ వ్యాపారి తెలుగువాడైన నాన్ని (Nanni) తనకు జరిగిన అన్యాయానికి కోపించి 'ఊర్' (UR) పట్టణంలోని సంబంధిత వ్యాపారి Ea Nassirకు Clay Tablets మీద రాసిన లేఖ తవ్వకాల్లో దొరికొంది. (ఊర్, బాబిలోన్ నగరాలకు అతి సమీపంగా నైఋతి దిశగా రోమ్ సామ్రాజ్యం ఉంది. రోమన్‌ల నాణెములు మనకు కోటిలింగాల తవ్వకాలలో దొరికాయి.) (UR) నగరంలోని ఈ నాసిర్ ఇంట్లో తెలిమన్ వ్యాపారపు ఒప్పందం పత్రం (Clay Tablets) లభించింది. దాంట్లో Abba (అబ్బా), Appa (అప్ప), Anu (అను), Aqqw (అక్కు > హక్కు), Ser (సెరి=చెరి), Appilu (అప్పిలు > అప్పులో), Nimmakku Iskunti (నిమక్కు ఇస్కుంటి = మీకు ఇచ్చుకుంటి), Anna Ittisu (అన ఇట్టిసు= ప్రమాణము చేసెను) వంటి పదాలు లభించాయి[28].

నాన్ని ఉత్తరంలో రాగి దిగుమతి విషయంగా రాసిన లేఖలో (క్రీ.పూ. 1907 నాటి Clay Tablets) క్యూనిఫాం లిపిలో తెలుగువాని కోపం తెలిసింది. IA ATI (అయ్యా అది), Anniim (అన్నియం > అన్యాయం), Tusi im mmani maki (తూసి ఇమ్మని మాకి = తూచి ఇమ్మని మాకు), Maari a weliki Maneti (మరి ఆవెలకిమ్మానేటి), Ina Aliik Telmun (అయినా అలిక్ తెలిమన్), Ma Annuum Sakiaam (మా అన్యాయం సకియం = సంహించం), Ipusa Anniima (ఇప్పుస అన్ని ఇమా = ఇంత అన్యాయమా?) ఇవి నేటికి 3900 ఏండ్ల క్రింది తెలుగు / ద్రావిడ పదాలు.

సుమేరియన్ల పురాణ గాథలు గ్రహించి హిబ్రూ జాతీయులు బైబిల్‌లోని Old Testamentలో కథలు రాసారు. ఆ బైబిల్ కథలలో మన తెలుగు పేర్లు ఉన్నాయి. తెలిమన్ల నుండి సుమేరియాకు,

సుమేరియన్ల నుండి హిబ్రూలకు ఈ తెలుగు వ్యక్తుల పేర్లు బట్వాడా ఐనాయి. Holy Bibleలోని Old Testamentలో Seraiah(సేరయ్య), Meraiah (మీరయ్య), Hashbaiah (షష్బయ్య), Sherebiah (శరభయ్య) వంటివి ఇందుకు దాహరణలు. Holi Bibleలో చెప్పబడ్డ Genesisలోని Land of Shiner పైన చెప్పిన తెలిమన్ లాండ్ ఒకటే కావడం వల్ల చరిత్రలో తెలిమన్‌కు చాలా ప్రాముఖ్యం లభించింది. ఇవన్నీ సంయుక్తగారు వివరించిన తెలుగుపదాలు[29]. హోలీబైబిల్‌లో Kishon నది, Naarath (నారదుడు), Kanha (కృష్ణ), Ramah (రామ), Sisera (శిశిర), Thimnathah (తిమ్మనాథః), Murari (మురారి) వంటి పురాణ పాత్రల పేర్లు లభిస్తున్నాయి.

పై అంశాలాధారంగా తెలివాహనది (గోదావరినది) తీరమైన తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, బస్తరు జిల్లాలు తెలుగు నేల అతి ప్రాచీన ప్రాంతాలనీ, ఇక్కడ ఉండే తెలిమన్లు గోదావరి లోయగుండా సముద్ర మార్గాన సుమేరు ప్రాంతాలకు వలస వెళ్లారని, తమ పూర్వజులతో వర్తక సంబంధాలు కొనసాగించారని, ఇదంతా క్రీ.పూ. 2000సం॥ నాటిదనీ, (నేటికి నాలుగు వేల ఏండ్లు) అక్కడ నుండే ద్రావిడ మూలం నుండి విడిపోయి తెలుగు స్వతంత్ర భాషగా కొంతకాలానికి స్థిరపడిందని, అప్పటికి వివిధ జన పదాలుగా గణరాజ్యాలుగా ఉండి. క్రీ.పూ. 500 సం॥ నాటికి రాజ్యాలేర్పడి, దుర్గాలేర్పడి, మగధ రాజన్యులచే గుర్తించబడి, తరువాత శాతవాహనుల ఏలుబడిలోకి ఈ ప్రాంతాలు వచ్చాయని భావించవచ్చు.

**అథస్సూచికలు:**

1. శెరవనీయ (శ్రీవనిజ) జాతక కథలో ''తెలివాహ నామ నదీం ఉత్తీరిత్వా, ఆంధ్రపురం నామ నగరం ప్రవిశంతు'' (సంస్కృతీకరణం) అని ఉంది. The earlier Andhra Capital (Andhra Pura) was situated on the bank of Televaha river (Probabaly Tel or Telingiri) in the srivanija jataka, A dealer crosses the river Televaha and entered in the town called Andhra Pura. - "Andhra Scluptures" - C. Ganguly, The A.P. Govt. Archeology Dept. Publication P. 19.
2. ఆంధ్రభాషా వికాసము - ఆచార్య గంటి జోగి సోమయాజి. P. 26.
3. అంధా పథీ యోగామో విరిపరం - శివస్కంధవర్మ శాసనం
4. Religion in Andhra - B.L. Hanumantha Rao, Archaelogy Publi.
5. Ancient & Medieval History of Andhra Pradesh, P.R. Rao 1994
6. A.P. Journal of Archaelogy Vol. III No.2,1985, Hyderabad - P.21
7. "Maccrindles Magasthenes"-Indian antiguary (1877) Vol. VI, PP. 337-339
8. వినయపిటక 46, అంగుత్తరనికాయ I-213 ప్రకారం కీ.పూ. 600 నాటికి షోడశ మహా జనపదాల్లో గోదావరి తీరస్థ అశ్మకం ఒకటి. ఇది సుత్తనిపాతం (977)లో పేర్కొబడింది.
9. సుత్తనిపాత - వత్థుగాథ - పారాయణవర్గ - అనువాదం - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి
10. 'మిసిమి' - బుద్ధజయంతి ప్రత్యేక సంచిక మే - 2004, P. 210
11. 'సప్తగోదావరి ఎక్కడ' - నా వ్యాసం 'మిసిమి' పత్రిక ఆగష్టు, 2003
12. శాతవాహనుల విదేశీ వ్యాపారం వల్ల తెలుగువారు సాకొత్ర (East Africa), బర్మా, సుమత్ర దేశాల్లో స్థిరపడ్డారని, అరకన్‌దేశరాజధానికి 'త్రిలింగ' అని, సయాం దేశంలో 'కాకులం' అని

నగరాలకు పేర్లు తెలుగువారే పెట్టుకొన్నారని 'ఆంధ్ర శాతవాహనులు' అన్న వ్యాసంలో డా. ఏ. నాగభూషణం తెలిపారు. భారతీయ వారసత్వం - సంస్కృతి P. 102 తెలుగు అకాడమీ 1994 (వీరు తెలంగాణలోని ఒక్క బౌద్ధ స్థూపం గూర్చి కూడా తెలుపలేదు. తొలి శాతవాహనుల రాజధాని కోటిలింగాల గూర్చి రాయలేదు. తవ్వకాలకు దశాబ్దం తర్వాత ఈ గ్రంథం అచ్చైంది.)

13. నామ విజ్ఞానం - యార్లగడ్డ బాలగంగాధరరావు.
14. ఆంధ్ర భాషా వికాసం - విద్వాన్ గంటి జోగిసోమయాజి, P. 26.
15. త్రినగ = మహేంద్ర, శ్రీశైల, కాళహస్తి పర్వతాలు - ఆంధ్రభాషా చరిత్ర - చిలుకూరి నారాయణరావు, P. 32
16. త్రికళింగ = మధుకళింగ, ఉత్కళింగ, కళింగ (12వ శ. ముఖలింగశాసనం)
త్రిలింగ = ఎ) శ్రీశైల భీమ కాళేశ మహేంద్రగిరి సంయుతం (బ్రహ్మాండ పురాణం)
బి) శ్రీశైల కాళేశ్వర దాక్షారామ నివాసినః (ప్రతాప రుద్రీయం 5-22) నాటకప్రకరణం
సి) తెలుగు శబ్దం ప్రాచీనమని త్రిలింగ అనేది సంస్కృతీకరణమని కొమర్రాజు వారన్నారు. లక్ష్మణరాయ వ్యాసావళి P. 122

17) ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం - ఖండవల్లి లక్ష్మీరంజనం
18) తిలలవలె గోవులు కల దేశం 'తెలుగు' అని కల్లూరి వెంకటనారాయణరావు 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర' P. 32
19) ల-నగా మారుటకు భాషా శాస్త్రజ్ఞులిచ్చిన ఉదాహరణలు లచ్చి > నచ్చి, లెగు > నెగు, లేదు > నేదు, లంజ > నంజ, లాంగలి > నాగలి చూ. భద్రిరాజు కృష్ణమూర్తి Telugu Verbal bases. P. 41
20) 'మిసిమి' మాసపత్రిక అక్టోబర్2000 - సంయుక్త కూనియ్య వ్యాసం P. 315, 317.
21) History of the Ancient World - F.K. Orovkin P. 69
22) మరుగున పడ్డ వారసత్వం - సూర్యన్ కాశీ పాండ్యన్ తెలుగు అకాడమీ (1989)
23) ప్రపంచ నాగరిక చరిత్ర - తెలుగు అకాడమీ P. 215
24) ప్రపంచ నాగరిక చరిత్ర - తెలుగు అకాడమీ P. 73
25) ఆంధ్రజ్యోతి ఆదివారం 27 ఏప్రిల్2003 - యస్. వేణుగోపాల్-ఈ వ్యాసంలో తెలుగు వారు సుమేరియన్ల నుండి ఎంతో నేర్చుకున్నారని, సుమేరియన్లు సముద్రయానం ద్వారా భారతదేశం చేరుకున్నారని రాసారు. కాని సుమేరియన్లు తెలంగాణ నుండే వలసవెళ్లిన జాతిగా వారు గుర్తించలేదు.
26) History of the Ancient World - F.K. Orovkin, P. 69
27) ప్రపంచ నాగరిక చరిత్ర - James Edvar Swain
28) 'మిసిమి' - సంయుక్త కూనియ్య వ్యాసం తెలుగుభాష అక్టోబర్ - 2000
29) 'మిసిమి' - సంయుక్త కూనియ్య వ్యాసం కృష్ణానది జనవరి - 2002

# మనిషికి పెద్ద బెడదగా తయారయిన దోమలు

– సి. వి. సర్వేశ్వర శర్మ

దోమల వల్ల మనిషి ఎంతో నష్టపోతున్నాడు. దోమల వల్ల కార్మికుల ఉత్పాదక శక్తి ముప్పయి శాతం తగ్గిపోతోందని ఒక అంచనా. మలేరియా, ఫైలేరియా, చలి జ్వరం, డింగీ జ్వరం వంటి వ్యాధులు దోమల వల్ల మనుషుల్లో వ్యాప్తి చెందుతున్నాయి. దోమల సమస్య ఈనాటిది కాదు. అనాదిగా మానవుడు ఈ సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నాడు. దోమల బారి నుండి రక్షణకు మనిషి ఎప్పటికప్పుడు పథకాలు వేస్తూనే వున్నాడు. అయినా సమస్య మళ్లీ మొదటికి వస్తోంది.

దోమలను ఆకర్షించే పదార్థాలు కనుగొన్నట్లు, దోమలను తరిమివేసే దుస్తులు తయారు చేసినట్లు పత్రికల్లో మనం చూస్తూ ఉంటాం. 'పెన్‌కాప్' సైజులో ఉండే అతిధ్వనులను ఉత్పత్తి చేసే పరికరాన్ని నిర్మించారు. దీనిని జేబులో ఉంచుకుంటే అది ఉత్పత్తి చేసే అతిధ్వనులకు దోమలు దరిజేరవు.

**ఆడదోమలే కుడతాయి:** ఆడదోమ వేడిరక్తం తాగితే దాని సంతానోత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. అందుకే మనిషి రక్తం పీల్చేందుకు ఇవి మనుషులను కుడతాయి. ఆడదోమ ఒకనెల కాలం జీవిస్తుంది. ఆడదోమ వేడిరక్తం తాగడం వల్ల అవి గుడ్లు పెట్టగల్గుతాయి.

మగదోమ ఎనిమిది నుండి పదిరోజులు మాత్రమే జీవిస్తుంది. ఎంత వేగంతో దోమలు ప్రయాణం చేయగలవో తెలియదు కాని అవి పది కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణం చేయగలవు.

ఇళ్లల్లోకి సాధారణంగా మగదోమలు రావు. ఒక వేళ వస్తే అవి ఆడదోమల పొందుకోసం వస్తాయి. మగదోమలు గుంపులు గుంపులుగా జేరతాయి. వాటి రెక్కల వెనుక ఉండే బ్యాలన్సర్లతో శబ్దం పుట్టిస్తాయి. ఈ శబ్దానికి ఆడదోమలు పరవశం చెంది మగ దోమల చెంతకు వెడతాయి. రెండు మూడు నిముషాల కాలంలో ఆడ- మగ దోమలు సృష్టి కార్యక్రమం పూర్తి చేస్తాయి.

**అతిధ్వని పరికరం:** 'పెన్‌కాప్' సైజులో ఉండే అతిధ్వని పరికరం ఉత్పత్తి చేసే శబ్దం మగదోమలు సృష్టించే శృంగార శబ్దాలు మాదిరి ఉంటాయి. ఆ శబ్దానికి పరవశం చెందే ఆడదోమలు మనిషిని కుట్టడం మరచిపోతాయి.

మరణించిన దోమలు భూమికి చేరడం వల్ల నేల సారవంతమవుతుందని నమ్మిక ఉండడం వల్ల దోమలను సమూలంగా నాశనం చేయడానికి ఎవరూ సుముఖంగా లేరు. రష్యాలో మగదోమలను నిర్వీర్యం చేసి దోమల అభివృద్ధిని కొంత వరకు అరికట్ట గలిగారు. సాధారణంగా ఆడదోమలు నీటిలో గుడ్లు పెడతాయి. దోమ యొక్క లార్వా ప్యూపాగా మారి నీటి ఉపరితలాన్ని జేరుతుంది. లార్వా నుండి బయటకు వచ్చే దోమ లార్వా కవచం పై తేలుతుంది.

నిల్వ నీటిలో దోమల సంతతి బాగా వృద్ధి చెందుతుంది. ఇటువంటి నీటిపై నూనె జల్లితే నీటి తలతన్యత తగ్గుతుంది. ఆ నీటిలో లార్వా మునిగిపోతుంది. ఇక దోమ సమస్య ఉండదు.

అసలు నీటిపై తేలుతున్న లార్వా కవచం నుండి వచ్చే దోమ గట్టిగా గాలివీస్తే చనిపోతుంది. ఎందుకంటే ఈ దశలో దోమ ఈదలేదు, ఎగరలేదు.

**దోమల సంహారం:** మగ దోమల వల్ల మనకు ఏ విధమైన సమస్య ఉండదు. అవి మొక్కల్లోని రసాన్ని పీల్చుకుని జీవించేస్తాయి. లార్వాదశకు వచ్చిన దోమను సంహరించడం గాక ప్యూపాదశలో వాటిని తుదముట్టించాలని కొన్ని కీటక నాశనులను ఉపయోగిస్తున్నారు.

---

సి. వి. సర్వేశ్వరశర్మ, అమలాపురం, శ్రీ కోనసీమ భానోజీ రామర్స్ కళాశాలలో భౌతిక విజ్ఞాన శాస్త్ర శాఖలో రీడర్‌గా పనిచేసి రిటైర్ అయినారు.

విచిత్రం ఏమిటంటే ఈ కీటక నాశనుల లోని రసాయనాల ప్రభావం నుండి తమను తాము రక్షించుకునే విధంగా దోమలు తమ నిరోధక శక్తిని పెంచుకుంటున్నాయి.

దోమల బెడదను తొలగించుకోవాలని అన్ని దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఇటీవల కాలంలో దోమల ప్రవర్తనా సరళి మారిందని మన భారత వైద్య పరిశోధనా సంస్థ వెల్లడించింది. అరుణాచల ప్రదేశ్, మేఘాలయ, అస్సాం రాష్ట్రాలలో ఈ విషయం స్పష్టంగా గుర్తించామంటున్నారు.

**ఫ్రెంచి వారి పద్ధతి :** దోమలను తుదముట్టించడానికి ఫ్రెంచివారు కొత్త ప్రణాళికలు రూపొందించుకున్నారు. దోమల నిర్మూలనకు వీరు జీవ కీటక నాశినిలను ఉపయోగిస్తున్నారు.

దోమలు ఏ ఏ ప్రాంతాల్లో ఎక్కువగా గుడ్లు పెడుతున్నాయో ఆ ప్రాంతాల్లో బేసిలస్ సఫేరికస్ అని పిలిచే జీవ కీటక నాశినిలను వదులుతారు. ఈ నాశిని గుడ్లను తినేస్తుంది.

క్యూలెక్స్ దోమ రాత్రి సమయాల్లో కొన్ని రుతువుల్లో ఒక మనిషిని 300 సార్లు కుడుతున్నట్లు గుర్తించారు. ఇటువంటి దోమల ఆట ఈ కీటక నాశిని వల్ల ఆగిపోతుందని ఫ్రెంచి శాస్త్రవేత్తలు అంటున్నారు.

ఈ జీవ కీటక నాశినిల వల్ల జన జీవితాలను దుర్భరం చేస్తున్న కొన్ని వ్యాధులను అరికట్టవచ్చునని అంటున్నారు.

**ప్రస్తుతం వాడుతున్నవి:** దోమల నివారణ కోసం మూడు పద్ధతులు వాడుకలో వున్నాయి. కాయిల్స్ వెలిగించడం, క్రీములు వాడడం, పాడ్స్‌ను వేడెక్కించడం. వీటివల్ల వెలువడే రసాయనాలు దోమలను తరిమి వేస్తాయి.

వీటి వాడకం వల్ల దోమల మాట అటుంచి మనుషులకు హాని కల్గుతోందని కొందరి పరిశోధకుల అభిప్రాయం. నరాలకు ఈ పదార్థాలు విడుదల చేసే రసాయనాలు ముప్పు తెస్తాయని వీరి వాదన.

ఈ విష పదార్థాల వల్ల కేంద్ర నాడీ వ్యవస్థ క్రమేపి దెబ్బ తినవచ్చునని కూడా హెచ్చరిస్తున్నారు. దోమల బెడద లేకుండా తాత్కాలికంగా సుఖంగా నిద్ర పట్టినా భవిష్యత్‌లో వీటి వాడకం వల్ల కాన్సర్ వచ్చే ప్రమాదం లేకపోలేదని చెబుతున్నారు.

**కాయిల్స్‌లో:** దోమలను తరిమే కాయిల్స్‌లో పైరెత్రమ్ మార్క్ ఉంటుంది. పొద్దు తిరుగుడు పువ్వులో ఉండే పైరెత్రమ్ రసాయన పదార్థంలో పైరెత్రిన్, సినెరిన్ అనే రసాయనాలు ఉంటాయి. వీటికి కీటకాలను సంహరించే గుణం ఉంటుంది.

పొద్దు తిరుగుడు పువ్వుల నుండి పైరెత్రమ్ సంగ్రహించగా మిగిలిన పదార్థమే పైరెత్రమ్ మార్క్. క్వాయిల్ తయారీకి సెల్యులోజ్, పారాఫిన్ మైనాన్ని వాడతారు. దీనితో తయారయిన చుట్ట కాలుతున్నప్పుడు కార్బన్‌మోనాక్సైడ్ విడుదలవుతుంది. తక్కువ మోతాదులో విడుదలయినప్పటికిని దీర్ఘకాలం మనిషి ఈ వాతావరణంలో ఉండడం వల్ల దుష్ఫలితాలు ఎదురవుతాయంటున్నారు.

క్రీమ్‌లలో డై ఈథైల్ అండ్ ఫినైల్ ఫార్మయిడ్ ఉంది. ఇది కూడా ఆరోగ్యానికి హానికరమే అంటున్నారు. పాడ్స్ విడుదల చేసే రసాయనాల వల్ల కేంద్ర నాడీ వ్యవస్థ డిప్రషన్‌కు లోనవుతుందేమోనని అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. ఈ డిప్రెషన్ వల్ల నిద్రపడుతుంది కాని దోమలు వైదొలుగుతున్నాయా? అనేది అనుమానమే అంటున్నారు.

అందుకే జీవ కీటక నాశినిలు వాడకంలోకి రావాలని ఎదురు చూస్తున్నారు.



వర్జిన్ అండ్ చైల్డ్ విత్ సెయింట్ అనె అండ్ ది లాంబ్

**చిత్రకారుడు : డావిన్సీ**

MISIMI/ మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD-191/2003



చిత్రం : ది లాస్ట్ సప్పర్.

చిత్రకారుడు : డావిన్సీ